మంగళవారం
26-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 184
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

కుప్పకూలిన ఆలయ ప్రహరీ

గుర్గావ్: హరియాణా రాష్ట్రంలోని గుర్గావ్ పట్టణంలో ఘోరం జరిగింది. స్థానికంగా ఉన్న ఓ ఆలయానికి సంబంధించిన ప్రహరీ గోడ ఒక్కసారిగా కుప్పకూలింది. కూలిన గోడ శిథిలాల కింద ఐదుగురు చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న అధికారులు శిథిలాల కింద ఉన్న వారిని వెలికి తీసేందుకు సహాయక చర్యలు చేపట్టారు. సాధ్యమైనంత త్వరగా శిథిలాలను తొలగించి బాధితులను వెలికి తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే శిథిలాల కింద చిక్కుకున్న వారు ప్రాణాలతో ఉన్నారా? లేదా? అనేది ఇప్పుడే చెప్పలేమని అధికారులు తెలిపారు. ఆలయ గోడ కూలడానికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. ఘటనపై కేసు నమోదు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు చెప్పారు.

వందేళ్ల వైపు వడివడిగా...!

నేడు భారత కమ్యూనిస్టు పార్టీ 99వ వ్యవస్థాపక దినం

సమసమాజ స్థాపన కోసం 1925 డిసెంబరు 26వ తేదీన ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వందేళ్ల రాజకీయ పర్వాన్ని పూర్తి చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా తొలి విప్లవ దివిటీని ప్రజ్వలింపజేసిన సీపీఐ ఆనాటి నుంచి పెట్టుబడిదారీ, బూర్జువా వ్యవస్థలకు వ్యతిరేకంగా నినదిస్తూ, ప్రజా వ్యతిరేక ప్రభుత్వాల విధానాలను ఎండగడుతూ, కార్మిక, కర్షక, మహిళా, యువజన, విద్యార్థి, ఉద్యోగ, కళాకారులతోపాటు బలహీన, బడుగు వర్గాల హక్కుల కోసం పోరాడుతూ, భారత సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర భారతావని పరిరక్షణకు అహర్నిశలూ శ్రమిస్తున్న సీపీఐ శతవసంతంలోకి అడుగుపెడుతూ నేడు 99వ వ్యవస్థాపక దినాన్ని జరుపుకుంటున్నది. పేదల పక్షపాతిగా మహోజ్వల పోరాటాలను నిర్మించుకొని అపారమైన ఉద్యమ చరిత్రను సొంతం చేసుకుంది. కారల్‌మార్క్స్, ఏంగెల్స్, వీఐ లెనిన్ అందించిన సైద్ధాంతిక స్ఫూర్తితో నడిచిన సీపీఐ అనేక త్యాగాలకు పుట్టినిల్లు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, ఇంకెన్నో రాజకీయ సునామీలకు పడిలేస్తూ అచంచలమైన, అభేద్యమైన నడకతో 'నిండు నూరేళ్ల' పార్టీగా సీపీఐ జనం గుండెల్లో మహోన్నత స్థానాన్ని పదిలపర్చుకుంది. ఇప్పుడు భారత కమ్యూనిస్టు పార్టీ 99వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా పార్టీకి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇదే స్ఫూర్తితో మరింత గొప్ప ఉద్యమశీలిగా ఉంటుందని ఆశిద్దాం.

ప్రత్యేక వ్యాసాలు 4వ పేజీలో

కృత్రిమ మేథస్సును ఉపయోగించి సురవరం సుధాకరరెడ్డి రూపొందించిన చిత్రం

విజయవాడలోని చంద్ర రాజేశ్వరరావు విగ్రహం వద్ద అరుణపతాకాలు, తోరణాలు, ఫ్లెక్సీలతో అలంకరణ

టికెట్ల గోల

- నేటి నుంచి సీఎం సమీక్షలకు సన్నద్ధం!
- వైసీపీలో ఆగని అసంతృప్తులు
- టీడీపీలోకి ఎమ్మెల్యే చంటిబాబు?
- ఇన్‌ఛార్జ్‌ల మార్పు ప్రభావం
- తాడేపల్లిలో మత్స్యకార కులాల సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లను మార్చాలని వైసీపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయంపై ఇంకా అసంతృప్తులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే టికెట్లు రావని స్పష్టమైన వారంతా ఇతర పార్టీల నేతలతో మంతనాలు జరుపుతున్నారు. దీనిని గుర్తించిన వైసీపీ అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తోంది. తాజాగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన జగ్గంపేట వైసీపీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు టీడీపీలోకి చేరేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. వచ్చే నెల 5వ తేదీ తర్వాత టీడీపీలో చేరేందుకు ఆ పార్టీ ముఖ్య నేతలతో ఆయన చర్చించినట్లు సమాచారం. 2019 ఎన్నికల్లో తొలిసారిగా ఆయన వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైసీపీ మార్పులు, చేర్పుల్లో భాగంగా ఉభయ గోదావరి జిల్లాల్లో భాగంగా జ్యోతుల చంటిబాబుకు టికెట్ లేదని అధిష్టానం తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఇటీవల ఆయన సీఎం జగన్‌ను నేరుగా కలిసి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరగా టికెట్ ఇవ్వలేనని, అందుకు ప్రత్యామ్నాయంగా అవకాశం కల్పిస్తానని, పార్టీ తరపున పూర్తిగా అండగా నిలుస్తామని జగన్ భరోసా ఇచ్చినట్లు సమాచారం. దీంతో చంటిబాబు అనుచరుల ఒత్తిడితో ఆయన పార్టీ మారేందుకు కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా ప్రచారం ఉంది. టీడీపీ నుంచి కూడా జగ్గంపేట టికెట్ ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో బేషరతుగా ఆయన టీడీపీలో చేరతారని తెలిసింది. తొలివిడత జాబితాలో తన నియోజకవర్గానికి కొత్త ఇన్‌ఛార్జ్‌ని నియమించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గుంటూరు జిల్లా మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే. ఇదేబాటలో పిఠాపురం ఎమ్మెల్యే దొరబాబు ఉన్నారు. ఇప్పటికే ఆయన అనుచరులతో భేటీ అయ్యి, వచ్చే ఎన్నికలకు పోటీకి సిద్ధమని ప్రకటించారు. జనసేనలోకి వెళ్లేందుకు ఆయన చర్చలు జరిపినట్లు ప్రచారం. మొత్తంగా నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌ల మార్పు నిర్ణయంతో వైసీపీ ఎమ్మెల్యేలలో పెద్దఎత్తున అసంతృప్తి చోటుచేసుకుంటోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రెండో విడత జాబితాను క్రిస్మస్ తర్వాతకు వైసీపీ అధిష్టానం వాయిదా వేసింది. సీఎం జగన్ కడప జిల్లా పర్యటన ముగియడంతో మళ్లీ ఇన్‌ఛార్జ్‌ల మార్పు అంశం తెరపైకి వచ్చింది. సీఎం తాడేపల్లికి వచ్చిన అనంతరం తిరిగి ఇన్‌ఛార్జ్‌ల మార్పులు, చేర్పులపై సన్నద్ధం కానున్నారు. రెండో జాబితాలో ఉభయ గోదావరి జిల్లాలు ప్రధానంగా ఉంటాయి. ఆ తర్వాత ఉమ్మడి కృష్ణా, రాయలసీమ జిల్లాల ఇన్‌ఛార్జ్‌ల మార్పుపై సీఎం ప్రధాన దృష్టి పెడతారని తెలిసింది. దీంతో టికెట్లు రావని తెలిసిన ఎమ్మెల్యేలంతా ఆందోళనతో ఉన్నారు. కొందరు ఇప్పటికే పక్క పార్టీల వైపు దిక్కులు చూస్తున్నారు.

మోపిదేవి తొలగింపుపై అనుచరుల ఆగ్రహం

వైసీపీ రేపల్లె ఇన్‌ఛార్జిగా ఉన్న ఎంపీ మోపిదేవి వెంకటరమణను తొలగించడంపై ఆయన అనుచరులు ఇంకా అసంతృప్తి వీడలేదు. తాజాగా తాడేపల్లిలో మత్స్యకార కులాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మత్స్యకార సామాజికవర్గానికి చెందిన 14 మంది నేతలు హాజరయ్యారు. మోపిదేవికి టికెట్ ఇవ్వకుంటే ఇతర జిల్లాల్లోని పార్టీకి నష్టమని పేర్కొన్నారు. అధిష్టానం తక్షణమే తన నిర్ణయాన్ని మార్చుకొని, రాబోయే

- మిగతా 2 లో

అధికారుల అవినీతికి సీఎం, మంత్రులే కారకులు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ:
అధికారుల అవినీతికి ముఖ్యమంత్రి, మంత్రులే కారకులని, దీనికి సీఎం, మంత్రులు నైతిక బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. 'ఆవు చేలో మేస్తుంటే, దూడ గట్టున మేస్తుందా?' అన్న చందంగా రాష్ట్రంలో అవినీతిపర్వం పెచ్చరిల్లిందన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లిక్కర్, మైనింగ్, ఇసుక అమ్మకాల ద్వారా వచ్చిన కోట్లాది రూపాయల సొమ్మును తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించినట్లు ఒక పక్క ఆరోపణలు గుప్పుమంటుంటే, మరో పక్క ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల పర్యటనలకయ్యే ఖర్చులను క్రిందిస్థాయి అధికారులు, సిబ్బంది సమకూర్చాలంటూ ఒత్తిడి పెంచడం అవినీతికి ఆస్కారమివ్వడమే నని పేర్కొన్నారు. కేవలం మడకశిర తహసీల్దార్‌ను సస్పెండ్ చేయడంతో సమస్య పరిష్కారం జరిగినట్లు భావిస్తున్నారని. వాస్తవానికి ఆ తహసీల్దార్ ఉన్నది ఉన్నట్లుగా చెప్పారని స్పష్టం చేశారు. తనపై గల ఒత్తిడి అంశాన్ని లేవనెత్తారని తెలిపారు. తమపై అధికారులు, మంత్రులు ఆయా జిల్లాల్లో, మండలాల్లో పర్యటించినప్పుడు అందుకయ్యే ఖర్చులు క్రిందిస్థాయి అధికారులే భరించాల్సిన దుస్థితే అందుకు కారణం అన్నారు. మంత్రులు,

- మిగతా 2 లో

బీజేపీకి సార్వత్రిక సంకటం

- 100 మందికి టికెట్ కట్!
- ఓటమి భయంలో అధిష్ఠానం దిద్దుబాటు చర్యలు
- సిట్టింగ్ ఎంపీలపై ప్రజల్లో వ్యతిరేకత
- వరుణ్‌గాంధీ, మేనకా సహా అనేక మంది ప్రముఖ నేతలు?

న్యూఢిల్లీ:
కాషాయ పార్టీ బీజేపీకి సార్వత్రిక ఎన్నికలు సంకటంగా మారాయి. ఓటమి భయంతో పార్టీలో దిద్దుబాటుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే అనేక మంది సిట్టింగ్ ఎంపీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొనడంతో వంద మందికి టికెట్ కట్ చేయాలని ఆ పార్టీ భావిస్తోంది. ఈ జాబితాలో అనేక మంది ప్రముఖ నేతలూ ఉన్నట్లు తెలుస్తోంది. మధ్య ప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత ఆయా ఆయా రాష్ట్రాల్లో సీఎంలుగా సీనియర్లను కాదని కొత్త ముఖాలను తెర ముందుకు తెచ్చిన బీజేపీ... ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలపై దృష్టి సారించినట్టు కనిపిస్తోంది. వరుసగా మూడోసారి అధికారం చేపట్టేందుకు పావులు కదుపుతోంది. ఇందుకోసం 2019 ఎన్నికల సమయంలో అనుసరించిన 'సిట్టింగ్ ఎంపీల స్థానాల్లో అభ్యర్థుల మార్పు' సూత్రాన్నే ఈసారి కూడా అమలు చేసే యోచనలో అగ్రనాయకత్వం ఉందని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 99 మంది సిట్టింగుల స్థానంలో కొత్త వారికి టికెట్ ఇచ్చిన కాషాయ పార్టీ వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కూడా దాదాపు 100 స్థానాల్లో సిట్టింగ్‌లను మార్చనున్నట్టు తెలుస్తోంది.

వారికే టికెట్లిస్తే ఆశలు వదులుకోవాల్సిందే..

వివిధ రాష్ట్రాలలో బీజేపీ ఎంపీల పనితీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు అసోసియేషన్ ఆఫ్ బ్రిలియంట్ మైండ్స్ (ఏబీఎం) అనే ఏజెన్సీ సర్వే నిర్వహించినట్టు తెలిసింది. ప్రాథమిక సర్వేలో దాదాపు 100 సిట్టింగ్ ఎంపీలపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారని, తిరిగి వారికే టికెట్లిస్తే ఆ సీట్లపై ఆశలు వదులుకోవాలని అధిష్ఠానానికి నివేదిక సమర్పించిందని సమాచారం. ఈసారి టికెట్ గల్లంతయ్యే వారి లిస్టులో వరుణ్ గాంధీ, మేనకా గాంధీ లాంటి ప్రముఖులు కూడా ఉన్నారని తెలుస్తోంది. 75 ఏళ్ల వయస్సు పైబడిన ఐదుగురు

- మిగతా 2 లో

కొల్లేరులో విద్యుత్ వెలుగులు

అక్రమ చెరువులకు వక్రమార్గంలో విద్యుత్ సరఫరా

2లో

ఇదీ లోకం!

మాకెవరూ టికెట్లివ్వలేదు... అందుకే మేమే ఒక పార్టీ పెట్టిపారేశాం!

అంగన్‌వాడీల పోరు ఉధృతం

- 31 వరకు కార్యాచరణ ప్రకటించిన నేతలు
- జనవరి 1నుంచి ఉద్యమం తీవ్రరూపం

విశాలాంధ్ర- విజయవాడ(చిట్టినగర్):
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు, న్యాయమైన తమ డిమాండ్ల పరిష్కారం కోసం గత పధ్నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంపై ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ పోరాటాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు ప్రకటించింది. సోమవారం బాలోత్సవ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈనెల 26నుంచి 31వ తేదీ వరకు చేపట్టనున్న ఉద్యమ కార్యాచరణను అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే లలితమ్మ, జేఎన్ పుష్పలత, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షురాలు జీ బేబిరాణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సుబ్బరావమ్మ, ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఆర్ జ్యోతి వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 14 రోజులుగా సమ్మె చేస్తున్నా అంగన్‌వాడీ కార్యకర్తల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడం విచారకరమన్నారు. స్పందన లేని ప్రభుత్వ తీరు

- మిగతా 2 లో

కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా వర్గ పోరాటాలు తీవ్రతరం చేయాలి

2లో



కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా

వర్గ పోరాటాలు తీవ్రతరం చేయాలి

యూరోపియన్ కమ్యూనిస్టు యూనియన్: కార్మిక వ్యతిరేక ఆదేశాలకు వ్యతిరేకంగా వర్గపోరాటాలు తీవ్రతరం చేయాలని యూరోపియన్ కమ్యూనిస్ట్ పార్టీ డిమాండ్ చేసింది. "యూరోపియన్ యూనియన్ (ఈయూ) పెట్టుబడుదారుల మూలధన ప్రయోజనాలకు, గుత్తాధిపత్యానికి అనుకూలంగా ఉండే చర్యలను ప్రోత్సహించడం సరికాదని పేర్కొంది. ఈయూ సామ్రాజ్యవాద ఆర్థిక, రాజకీయ, సైనిక కూటమి. దీనికి విరుద్ధంగా శ్రామికవర్గం, ప్రజల ప్రయోజనాల కోసం యూరోపియన్ కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది. పేదరికం, నిరుద్యోగం, ఉక్రెయిన్ వంటి సామ్రాజ్యవాద యుద్ధాలు, పలస్తీనియన్లపై ఇజ్రాయిల్ ఆక్రమణ వంటి దురాగతాలను యూరోపియన్ కమ్యూనిస్టు యూనియన్ (ఈసీఏ) ప్రతిఘటించింది. కార్మికులకు "శ్రేయస్సు" లక్ష్యంగా కార్మికుల హక్కులపై దాడులను తీవ్రతరం చేసే ఈయూ ఆంక్షలను సంయుక్తంగా ఖండించింది. ముఖ్యంగా శ్రామికులు ప్రత్యక్ష, పరోక్ష పన్నుల ద్వారా చెల్లించే చెల్లింపులను బడా వ్యాపారస్థుల పెట్టుబడుల కోసం, సంక్షేమ పథకాల్లో కోతలు, వాణిజ్యీకరణకు ఈసీఏ ఖండించింది. సామూహిక కార్మిక ఒప్పందాల రద్దు, అమానవీయ పని గంటలతో రోజువారీ పని గంటలు కుదింపు, నిరుద్యోగ భృతి, టెలివర్కింగ్, తక్కువ పెన్షన్‌లను కూడా నిరుద్యోగులకు దూరం చేసే చర్యలతో విస్తృతమైన నిరుద్యోగం పెరుగుతోందని పేర్కొంది. పదవీ విరమణ వయస్సును పరిగణలోకి తీసుకోకుండా ఆ వయస్సుకు మించిన పనిని పెంచడం, ప్రజారోగ్య వ్యవస్థలు విచ్ఛిన్నం కావడం, ఆకాశాన్నంటుతున్న ధరలతో బాధపడుతున్న శ్రామిక వర్గానికి ఖర్చులు పెరగడానికి దారితీస్తున్నాయి. పేదరికం, పన్నులు, అధిక అద్దెలు, వారి ఇళ్లను జప్తు చేయడం, ముఖ్యంగా యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ ద్వారా పదే పదే వడ్డీ రేటు పెంపుదలతోపాటు శ్రామికవర్గంపై బెదిరింపులు తీవ్రమవుతున్నాయి. దీనికి వ్యతిరేకంగా ఐరోపా అంతటాకార్మికులు చేపట్టిన సమ్మెలు, ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలపై జరిమానా విధించే చట్టాలు అమలు చేయబడుతున్నాయి. యజమానులు ఇప్పటికే ఉన్న పని పరిస్థితులను మరింత దిగజార్చడానిక, దోపిడీని తీవ్రతరం చేయడానికి యజమానుల నేతృత్వంలోని ట్రేడ్ యూనియన్‌లను ఉపయోగించుకుంటారు. దీనికి వ్యతిరేకంగా అనేక దేశాలలో కార్మికులు పోరాటాలు, సమ్మెలను నిర్వహించాలని యూరోపియన్ కమ్యూనిస్టు యాక్షన్ పెద్దఎత్తున సంకల్పించింది. పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా, సోషలిజం-కమ్యూనిజం స్థాపన లక్ష్యంగా ఈసీఏ పేర్కొంది. అంతిమంగా ప్రతి కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన అజెండా అంతర్జాతీయంగా ప్రపంచవ్యాప్త పోరాటానికి సిద్ధంకావాలని పిలుపునిచ్చింది.

ఆకలితో అలమటిస్తున్న గాజా

గాజా: గాజా లక్షలాదిమంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ఆధారంగా, గాజాలో నాలుగింట ఒక వంతు మంది ఆకలికోరల్లో చిక్కుకున్నారని తెలిపింది. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేపట్టిన దాడిలో ఇప్పటివరకు 20వేల మంది మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. గాజాలో కరువు రోజురోజుకీ పెరుగుతోందని యుఎన్ హెచ్చరించింది. ప్రపంచ ఆహార కార్యక్రమం ప్రధాన ఆర్థికవేత్త ఆరిఫ్ హుస్సేన్ మాట్లాడుతూ గాజాలో పరిస్థితి మరింత దిగజారుతోందని ఆవేదన వెలిబుచ్చారు. దక్షిణగాజాలో రఫాలో వందలాది మంది ప్రజలు ఆహారంకోసం వేచిచూడడం అక్కడి పరిస్థితిని తెలియజేస్తోంది. గాజా స్ట్రిప్‌లోని రఫాలో ఉచిత భోజనం కోసం చిన్నారులు వరుసలో

నిలుచుని ఉన్న దృశ్యం ఆవేదన కలిగిస్తోంది. "ఇతరుల మాదిరిగానే మమ్ములను సుఖంగా ఉండనివ్వండి. మనం రోజూ చనిపోతున్న మనుషులను చూస్తుంటాం, వాళ్లలాగే చనిపోవాలని అనుకుంటాం అని వ్యాఖ్యానించారు.

గాజాలో పాలస్తీనియన్లపై క్రూరమైన దాడికి పాల్పడినందుకు ఇజ్రాయిల్ ప్రభుత్వం స్వంత పౌరుల నుండి తీవ్ర నిరసనలను ఎదుర్కొంటోంది. ఇజ్రాయిల్‌లోని నిరసనకారులు హమాస్ చేతిలో ఉన్న బందీలను విడిపించేందుకు చర్చలను పునరుద్ధరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. టెల్ అవీవ్‌లోని రక్షణ మంత్రిత్వ శాఖ వెలుపల పెద్ద ఇజ్రాయిలీలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. గాజాను పాలించే ఇస్లామిస్ట్ గ్రూప్‌తో ప్రభుత్వం చర్చలను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉత్తర గాజాలో పెద్ద ఎత్తున జరిగిన బాంబు దాడులతో ఆ ప్రాంతం అంతా బయానకంగా తయారైంది. వేలాది మంది పౌరులు హతులయ్యారు. చాలా మంది శిబిరాల్లో తలదాచుకున్నారు. పాలస్తీనియన్లు, గాజా జనాభాలో దాదాపు 85 శాతం మంది తమ ఇళ్లను విడిచిపెట్టారు.

శాంతి,సామరస్యం కోసం పోప్ పిలుపు

వాటికన్: గాజాలో జరుగుతున్న భీకర యుద్ధం నేపథ్యంలో క్రిస్మస్ సందర్భంగా ప్రపంచంలో శాంతి, సామరస్యతల కోసం పోప్ ఫ్రాన్సిస్ పిలుపునిచ్చారు. వాటికన్‌లోని సెయింట్ పీటర్స్ బసిలికాలో జరిగిన క్రిస్మస్ వేడుల్లో పాల్గొన్న సుమారు 6,500 మంది ప్రజలను ఉద్దేశించి 87ఏళ్ల పోప్ ఫ్రాన్సిస్ గద్గద స్వరంతో మాట్లాడుతూ పై విధంగా వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా జీసస్ శాంతి సందేశాన్ని చదివి వినిపించారు. మా హృదయాలన్నీ బెత్లెహామ్‌లో యుద్ధకోరల్లో ఉన్న ప్రజలపైనే ఉందన్నారు. ప్రజలు ప్రాపంచిక విజయాలపై మక్కువ చూపవద్దని ప్రజలను కోరారు. ఇజ్రాయిల్ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని బెత్లెహెమ్ నగరంలో యేసు క్రీస్తు 2,000 సంవత్సరాల క్రితం జన్మించాడని క్రైస్తవులు విశ్వసిస్తారు. సాధారణంగా వేలాది మంది పర్యాటకులు క్రిస్మస్ సందర్భంగా ప్రతి ఏటా ఈ ప్రదేశానికి భారీ సంఖ్యలో

హాజరవుతారు. అయితే ఈ ఏడాది పాలస్తీనా-ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న దాడుల నేపథ్యంలో క్రిస్మస్ వేడుకలను రద్దు చేశారు. "గాజాలో కాల్పుల విరమణ కోసం బెత్లెహెంలో గంటలు మోగుతున్నాయి" అన్న బ్యానర్‌తో భారీ సంఖ్యంలో పాలస్తీనా పౌరులు భారీ ప్రదర్శనచేపట్టారు. ఈ భూమి కోసం చాలా మంది చనిపోతున్నారు" అని ప్రదర్శనలో పాల్గొన్న నికోల్ నజ్జర్ అనే 18 ఏళ్ల విద్యార్థి వ్యాఖ్యానించారు. "మా ప్రజలు చనిపోతున్న సందర్భంలో క్రిస్మస్ జరుపుకోవడం శోచనీయమని అన్నారు.

వియత్నాంలోని హనోయిలో సెయింట్ జోసెఫ్ కేథడ్రల్‌లో క్రిస్మస్ ఈవ్ వేడుకలు ఘనగా జరిగాయి. ప్రధానంగా బౌద్ధ దేశం కావడంతో వియత్నాంలో క్రిస్మస్ అధికారిక సెలవుదినం కాదు, కానీ భారీ ఎత్తున ప్రజలు దీనిని మతపరమైన పండుగగా, కొత్త సాంస్కృతిక సంప్రదాయంగా జరుపుకుంటారు.

బీఫార్మసీ, ఫార్మాడీ విద్యార్థులకు

మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలి

సీఎం జగన్‌కు ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వినతి

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో బీఫార్మసీ, ఫార్మాడీ చదవాలనుకుంటున్న వేలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల సౌలభ్యం కోసం మూడో విడత కౌన్సెలింగ్ ఉత్తర్వులు జారీ చేయాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్వర్యాన విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు మలిరెడ్డి కోటారెడ్డి, అధ్యక్షులు నరహరి శిఖరం, కార్యదర్శి జీ ఈశ్వరయ్య మీడియాతో మాట్లాడుతూ ఈ కోర్సుల్లో ప్రవేశం కోరే విద్యార్థులకు ప్రభుత్వం ఇప్పటికే రెండు దఫాలుగా కౌన్సెలింగ్ నిర్వహించిందన్నారు. రెండు విడతల్లో వెయ్యి సీట్లు మిగిలిపోయాయని తెలిపారు. తాము కోరుకున్న కళాశాలలకు ఆప్షన్‌లు పెట్టిన సుమారు 4000 మంది విద్యార్థులు మూడవ కౌన్సెలింగ్ కోసం వేచి చూస్తున్నారని చెప్పారు.

కాగా మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహించకపోగా... ప్రైవేటు వైద్య కళాశాలల యాజమాన్యాలకు అనుకూలంగా స్పాట్ అడ్మిషన్ల ఉత్తర్వులు జారీ చేయడంతో ఇదే అదునుగా ప్రైవేట్ కళాశాలల వారు కన్వీనర్ కోటాలో ఉన్న సీట్లను కూడా మేనేజ్‌మెంట్ కోటాలోకి మార్చి అమ్ముకుంటున్నారని విమర్శించారు. దీనిపై ఏపీపీహెచ్ఈ ఆర్ఎంసీని పేరెంట్స్ అసోసియేషన్ వారు సంప్రదించగా ఇప్పటికే జనవరి వస్తున్నందున మరో మారు కౌన్సెలింగ్ పిలవడంలో అర్థం లేదన్నారని పేర్కొ న్నారు. గత సంవత్సరం జనవరి మాసంలోనే కౌన్సెలింగ్ నిర్వహించారని ఈ సంవత్సరం కళాశాల క్లాసులు ప్రారంభమై పది పదిహేనురోజులు మాత్రమే గడిచిందని వెంటనే స్పాట్ అడ్మిషన్ల ఉత్తర్వులు నిలుపుదల చేసి మూడో విడత కౌన్సెలింగ్ చేపట్టాలని కోరారు. తాము వివరించిన సమస్యపై ముఖ్యమంత్రి స్పందిస్తూ ఈ సమస్యను తప్పక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వివరించారు.

అధికారుల అవినీతికి సీఎం, మంత్రులే కారకులు

(మొదటిపేజీ తరువాయి)

అధికారుల పర్యటనల సందర్భంగా సభలు, సమావేశాలకు, భోజన, వసతులు, జనసమీకరణలకు అయ్యే తదితర ఖర్చులను ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. దీంతో కొందరు అధికారులు తమ సొంతంగా అప్పులు తెచ్చి పెట్టలేక, అవినీతికి పాల్పడుతున్నారని ఆ లేఖలో రామకృష్ణ పేర్కొన్నారు.

రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వం రాజ్యమేలటం వల్ల ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. అసలు పూర్తిస్థాయి అవినీతి పై నుండే జరుగుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులే పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతుంటే, క్రిందిస్థాయి అధికారులు అవినీతిలో కూరుకుపోవడంలో వింతేముందన్నారు. ఈ ఘటన కేవలం మడకశిర తహసీల్దార్‌కు సంబంధించినది మాత్రమే కాదన్నారు. రాష్ట్రంలోని 679 మండలాల్లో తహసీల్దార్‌లు, వివిధ విభాగాల అధికారులకు కూడా 'అధికారులు, మంత్రుల పర్యటన ఖర్చులకు నిధి కోటా చెల్లింపు' తప్పడం లేదన్నారు. ఆయా పర్యటనలకయ్యే ఖర్చులను భరించేందుకు క్రిందిస్థాయి వారికి చేయిచాపక తప్పే పరిస్థితి లేదని తెలిపారు. అధికారుల అవినీతికి ముఖ్యమంత్రి, మంత్రులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల పర్యటనలకయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, రాష్ట్రంలో అవినీతి, లంచగొండితనానికి ఆస్కారం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

బీజేపీకి సార్వత్రిక సంకటం

(మొదటిపేజీ తరువాయి)

నేతలు, పదవీ విరమణ వయసు దాటిన మరో పది మందిని ఈసారి పక్కన పెట్టాలని బీజేపీ అధిష్ఠానం ఆలోచిస్తున్నదని విశ్వసనీయ వర్గాల సమాచారం. వీరిలో మథుర ఎంపీ హేమమాలిని ఉన్నారు. అదేవిధంగా గుజరాత్‌లో 8 మంది, బీహార్, మహారాష్ట్రల్లో 10 మంది, మధ్య ప్రదేశ్‌లో 11 మందికి టికెట్లు కట్ చేయాలని యోచిస్తోంది. అయితే, 2019లో కూడా బీజేపీ అధిష్ఠానం చాలా మంది వృద్ధులైన సిట్టింగ్ ఎంపీలకు టికెట్లు ఇవ్వలేదని, అందులో ఎల్.కె.అద్వానీ, మురళీ మనోహర్ జోషి, మాజీ సీఎం బీసీ ఖండూరి, మాజీ స్పీకర్ సుమిత్రా మహాజన్ వంటి ప్రముఖులు కూడా ఉన్నారని పార్టీ వర్గాలు గుర్తు చేస్తున్నాయి.

కొల్లేరులో విద్యుత్ వెలుగులు

- అక్రమ చెరువులకు వక్రమార్గంలో విద్యుత్ సరఫరా
- ముడుపులకు అధికారులు జీ హుజూర్

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: కొల్లేరులో అక్రమ చెరువుల్లో విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఈ చెరువులను వివిధ శాఖలు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండగా... ఇప్పుడు ఆ జాబితాలోకి విద్యుత్ శాఖ కూడా చేరింది. అక్రమ ఆక్వా సాగుకు యథేచ్ఛగా విద్యుత్ సరఫరా జరిగిపోతోంది. గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ వ్యవహారంలో విద్యుత్ శాఖ అధికారులు వత్తాసు పలుకుతున్నారు. కొల్లేరు నడిబొడ్డున అక్రమంగా జరుగుతున్న ఆక్వా సాగుకు విద్యుత్ సరఫరా అవుతోంది. దీనిపై 'విశాలాంధ్ర' సమగ్రంగా పరిశీలించగా విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. కొల్లేరుని అనుకుని ఉన్న జిరాయితీ భూముల్లో విద్యుత్ కనెక్షన్లు తీసుకుని, అక్కడి నుంచి కొల్లేరులోకి విద్యుత్‌ను తీసుకువెళుతున్నారు. దీనికోసం అండర్ గ్రౌండ్ విద్యుత్ కోసం వాడే పెద్ద పెద్ద కేబుల్ వైర్లను వాడుతున్నారు. ఇదంతా మాఫియా అండతో విద్యుత్ శాఖ కనుసన్నల్లోనే జరుగుతోంది. ఈ రకంగా విద్యుత్‌ను మళ్లించుకునేందుకు పెద్ద మొత్తంలోనే చేతులు మారుతున్నాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. భీమడోలు మండలం కొల్లేరులో ఉన్న వేలాది అక్రమ చెరువులకు ఈ అక్రమ విద్యుత్ సరఫరా జరిగేది బహిరంగ రహస్యమే. కొల్లేరు ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటం, సుదూర ప్రాంతంలో ఉండడంతో ఇక్కడ జరిగే తంతు ఎవరూ గమనించలేరు. పైగా స్థానిక అధికారులకు ముడుపుల రూపంలో చేతులు తడుపుతుండడంతో ఈ వ్యవహారం గుట్టు చప్పుడు కాకుండా జరిగిపోతోంది. సామాన్యులు ఇంటిలోని విద్యుత్‌ను బయటి బడ్డీకొట్టు లాంటి దానిలో వాడితేనే కేసులు నమోదు చేసే విద్యుత్ సిబ్బంది, కాసులకు అలవాటు పడి అక్రమ ఆక్వా సాగుకు ప్రోత్సహించడమే కాకుండా వారికీ అక్రమ విద్యుత్ సరఫరాకు నిరాటంకంగా అనుమతి ఇస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఇదేమని విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నిస్తే చూస్తాం, పరిశీలిస్తామంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. ఇటీవల కాలంలో మండలంలో ఆక్వా సాగు బాగా విస్తరించింది. చేపలు, రొయ్యల సాగు చేస్తున్నారు. కొల్లేరు కూడా ఉండడంతో అక్రమార్కుల కన్నుపడింది. నిషిద్ధ కొల్లేరు ప్రాంతంలో ధ్వంసం చేసిన చెరువుల్లో మళ్లీ చెరువులను పునరుద్ధరించారు. సాగు కోసం వివిధ రకాలుగా విద్యుత్ అవసరం ఏర్పడుతుంది. చెరువుల్లో ఆక్సిజన్ తగ్గినప్పుడు ఏరేటర్లు వాడుతుంటారు. వాటికి విద్యుత్ అవసరం. చెరువుల్లోకి నీటిని తోడుకోవడానికి, అక్కడ నివాసం తదితర అవసరాల నిమిత్తం విద్యుత్ అవసరమే. అయితే ఈ అక్రమ సాగుకు గతంలో డీజిల్ మోటార్లు, జనరేటర్లు వాడేవారు. డీజిల్ ధరలు అమాంతం పెరగడంతో దీనికి ఖర్చు తడిసి మోపెడవుతోంది. విద్యుత్ వాడితే ఖర్చు తక్కువ అవుతుంది. ఒక పంటకు ఈ తేడా లక్షల్లో ఉంటుంది. ఇక్కడే ఖర్చు తగ్గించుకోవడానికి అక్రమ సాగుకు వక్ర ఆలోచనలు వచ్చాయి. విద్యుత్ అధికారులు కూడా సై అన్నారు. మీరు ఎన్ని కిలోమీటర్లు అయినా కొల్లేరులోకి విద్యుత్ తీసుకుపోండి. మాకు మాత్రం చేతులు తడపండి అని రహస్యంగా ఒప్పందం చేసుకున్నట్లు పేరు చెప్పడానికి ఇష్టపడని ఆక్వా రైతు వెల్లడించారు. జిరాయితీ చెరువుల్లో చెరువు సర్వే నంబర్లలో విద్యుత్ కనెక్షన్లు తీసుకుని, కొల్లేరులో సాగు చేయడం మొదలుపెట్టారు.

అధికారుల ప్రేక్షక పాత్ర

కొల్లేరులో చెక్‌పోస్టులు నామ్ కే వాస్తే... అక్రమాలకు గేట్లు ఎత్తడానికి తప్ప అడ్డుకోవడానికి కానేకాదన్నది జగమెరిగిన సత్యం. ఒకవేళ అటవీ, రెవెన్యూ, పోలీసు అధికారులు అడ్డుకునేందుకు సాహసిస్తే అదే వారికి ఆఖరి డ్యూటీ. తెల్లారేసరికి మరోచోటికి బదిలీ అయిపోతారు. ఏలూరు, కృష్ణా జిల్లా పరిధిలోని కొల్లేరు అభయారణ్యంలో 12 చోట్ల అటవీ చెక్‌పోస్టులు ఉన్నాయి. ప్రొక్లెయిన్‌లు, చెరువులు తవ్వే యంత్రాలు, ఇతర వాహనాలు వెళ్లాలంటే వీరి అనుమతి ఉండాలి. అధికారుల కన్నుసన్నల్లో యదేచ్ఛగా అర్ధరాత్రి వాహనాలు వెళతాయి. అయినా ఎవరూ వాటిని ఆపే ప్రయత్నం చేయరు. చేస్తే ఏం జరుగుతుందో తెలుసు.

అభయారణ్యంలో పక్షుల విలవిల

కొల్లేరు అభయారణ్యంలో అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా రహదారులు మించి, విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్ కనెక్షన్లను ఏర్పాటు చేసినా అదుపు చేసే వారూ, అడిగే వారు ఉండరు. విద్యుత్ వైర్లు తగిలి అనేక రకాల పక్షులు మృత్యువాత పడుతున్నాయి. దీనిని నియంత్రించే వారే కరువయ్యారు. ఒకవేళ నియంత్రించడానికి అభయారణ్యంలో అడుగు పెట్టాలంటే బయటకు వెళ్లే వరకు ఏదో తెలియని నీడ వెంటాడి తరిమినంత భయోత్పాతం సృష్టిస్తారు. దీనికోసం కొన్ని ముఠాలు పని చేస్తున్నాయి. అక్రమ విద్యుత్ వినియోగంపై అధికారులను వివరణ కోరినా సమాధానం చెప్పడానికి భయపడుతున్నారంటే కొల్లేరులో మాఫియా ఏ విధంగా పేట్రేగిపోతుందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ యంత్రాంగం ఇకనైనా స్పందించి అక్రమార్కుల భరతం పడితే కొల్లేరు అభయారణ్యాన్ని పరిరక్షించినట్లు అవుతుంది.

అంగన్‌వాడీల పోరు ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

చూసి కార్మికులు ఆందోళన చెందుతున్నారని... తిరుపతి, అనకాపల్లిలో కొందరు ఆందోళనకారులు ప్రాణాపాయ స్థితిలో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గతంలో జరిగిన చర్చలలో మినీ సెంటర్లను, మెయిన్ సెంటర్‌లుగా మారుస్తామని చెప్పినప్పటికీ ఇంతవరకు దానికి సంబంధించి జీవో ఇవ్వలేదన్నారు. అలాగే 30, 40 సంవత్సరాల నుంచి పనిచేస్తూ, సర్వీస్ లో ఉండి చనిపోతే... కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, కనీసం 10 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, మట్టి ఖర్చులు ఇవ్వాలని, గ్రేడ్ టు సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్ష రాసి ఎదురుచూస్తున్న 164 మందికి పోస్టులు ఇవ్వాలని, అంగన్‌వాడీ లందరికీ వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం, లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని, మెనూ చార్జీలు పెంచాలని, ఎస్ఆర్ఎస్ రద్దు చేయాలని, అన్ని యాప్ లు కలిపి ఒకే యాప్ గా మార్చాలన్న తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. వేలాదిమంది మహిళలు రెండు వారాలుగా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వంలో స్పందన కానరాకపోవడంతో మంగళవారం నుంచి పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని మూడు సంఘాల

యూనియన్ ప్రతినిధులు నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

26నుంచి 31వరకు ఉద్యమ కార్యాచరణ ఇదే...

- 26వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి కాళీ కంచాలను గరిటలతో మోగించడం
- 27వ తేదీన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఇళ్లకు/క్యాంప్ ఆఫీసులకు వెళ్లి సామూహికంగా వినతి పత్రాలు సమర్పించడం
- 28వ తేదీన ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డులు రాయడం
- 29వ తేదీన రిలే దీక్షలు చేపట్టడం
- 30వ తేదీన గ్రామ, వార్డు, సచివాలయం వద్ద ప్రజాసంఘాలు, ఇతరుల సహకారంతో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించడం
- 31వ తేదీన ఆట,పాట కార్యక్రమం ద్వారా ఆందోళన

అప్పటికీ ప్రభుత్వం దిగిరాకుంటే 2024 జనవరి 1 నుంచి అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.

టికెట్ల గోల

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల్లో రేపల్లెకి మోపిదేవి వెంకటరమణకు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల మోపిదేవి వెంకటరమణ మీడియా సమావేశం నిర్వహించి తాను అధిష్ఠానం నిర్ణయం మేరకు నడుచుకుంటానని, ఎవరికి టికెట్ ఇచ్చినా పని చేస్తానని ప్రకటించిన విషయం విదితమే. మళ్లీ మోపిదేవి అనుచరులు, మత్స్యకార కులాల సంఘాల నేతలు కీలక సమావేశం నిర్వహించి, వైసీపీ రేపల్లె ఇన్‌ఛార్జ్‌గా మోపిదేవి వెంకటరమణను తప్పించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

'పీకే' ఫీవర్

వైసీపీకి ప్రశాంత్ కిషోర్ (పీకే) ఫీవర్ పట్టుకుంది. 2019 ఎన్నికల్లో వైసీపీకి వ్యూహకర్తగా ప్రశాంత్ కిషోర్ పని చేశారు. ప్రస్తుతం ఆయన చంద్రబాబుతో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామం వైసీపీ శ్రేణులకు మింగుడు పడటం లేదు. పై పెచ్చు ప్రశాంత్ కిషోర్‌పై కొంతమంది వైసీపీ ఎమ్మెల్యేలు ఎదురుదాడికి దిగుతున్నారు. తాము వాడి పడేసిన వారిని చంద్రబాబు తీసుకున్నారని ఎద్దేవా చేస్తున్నారు. ఎంతమందిని చంద్రబాబు తెచ్చుకున్నా వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఓటమి తథ్యమని చెబుతున్నారు. చంద్రబాబును ప్రశాంత్ కిషోర్ కలవడంపై టీడీపీ శ్రేణులు ఊరట చెందుతున్నారు. ఆయన తన తప్పును తెలుసుకుని చంద్రబాబుకు వ్యూహకర్తగా వచ్చేందుకు సిద్ధమయ్యారని స్పష్టం చేస్తున్నారు. చంద్రబాబు-పీకే భేటీలో దేశ రాజకీయాలపైన ప్రధాన చర్చ జరిగినట్లు సమాచారం.

దేశ వ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ పని చేస్తున్నారు. ఇటీవల చంద్రబాబు, ప్రశాంత్ కిశోర్ కలయికతో టీడీపీకి వ్యూహకర్తగా ఉంటారన్న ప్రచారమే అధికంగా వచ్చింది. దాంతోపాటు వారిద్దరి మధ్య భేటీలో 'ఇండియా' కూటమిలోకి టీడీపీ చేరికపైనా చర్చించినట్లు సమాచారం. రాబోయే ఎన్నికల్లో 'ఇండియా' కూటమిలోకి టీడీపీ చేరితే, అప్పుడు రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు పూర్తిగా మారే అవకాశాలున్నాయి. ఏపీలో కాంగ్రెస్, టీడీపీ, వామపక్ష పార్టీలు ఉమ్మడిగా ఎన్నికల బరిలోకి వచ్చే వాతావరణం ఉంటుంది. బీజేపీతో టీడీపీ కలిసి వెళితే రాజకీయంగా తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని వామపక్షాలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే టీడీపీ-జనసేన పొత్తులతో ఉన్నాయి. ఈ క్రమంలో 'ఇండియా' కూటమిలోకి టీడీపీ చేరాలంటే, జనసేన పార్టీని కూడా బీజేపీ నుంచి దూరం చేయాలి.

అటు పవన్ కల్యాణ్ మాత్రం బీజేపీకి దూరమయ్యేలా ఆలోచించడం లేదు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో ఎన్నికల్లోకి వెళ్లి ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలనీయబోమని పవన్ చెబుతున్నారు. టీడీపీ-జనసేన కలిసి బీజేపీకి దూరమవుతున్నట్లు ప్రకటిస్తేనే, రాష్ట్రంలో 'ఇండియా' కూటమి ఏర్పాటుకు ఒక స్పష్టత వస్తుంది. ఆ దిశగా కేంద్రంలోని బీజేపీని, రాష్ట్రంలోని వైసీపీని గద్దె దించేందుకుగాను రాజకీయ పార్టీలు ఐక్యంగా సన్నద్ధం కావాల్సిన అవసరం ఉంది.

జగన్‌కు షర్మిల షాక్ !

లోకేశ్‌కు క్రిస్మస్ బహుమతి

ఆంధ్రా రాజకీయాల్లో చర్చ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం వైఎస్ జగన్‌కు ఆయన సోదరి షర్మిల మరోసారి షాక్ ఇచ్చారు. క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలతో టీడీపీ నేత లోకేశ్‌కు గిఫ్ట్ పంపారన్న ప్రచారం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇదే సందర్భంలో జగన్‌కు ఆమె ఎలాంటి శుభాకాంక్షలు తెలిపినట్లు వార్తలు రాలేదు. దీంతో తన అన్నను మానసికంగా దెబ్బతీసే ప్రక్రియలో భాగంగా, వైసీపీ ప్రత్యర్థి పార్టీ అయిన టీడీపీ నేత లోకేశ్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపినట్లుగా సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. తెలంగాణలో వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ (వైఎస్‌ఆర్‌టీపీ)ని స్థాపించిన షర్మిల... అక్కడ కొంతకాలంపాటు రాజకీయ కార్యకలాపాలు నడిపారు. ఆశించిన స్థాయిలో పార్టీకి కేడర్ ఏర్పడకపోవడం, నియోజకవర్గాలపై పట్టు రాకపోవడంతో తెలంగాణ ఎన్నికల్లో ఆమెగానీ, ఆమె పార్టీ నేతలు గానీ ఎక్కడా పోటీ చేయలేదు. కేసీఆర్ ఓటమే లక్ష్యంగా బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఆమె పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల చివరి దశలో కాంగ్రెస్‌తో పొత్తుకు ఆమె తీవ్ర ప్రయత్నాలు చేపట్టినా... ఫలించలేదు. ఢిల్లీకి వెళ్లి సోనియా, రాహుల్‌ను కలిసినా కాంగ్రెస్‌లోకి ఆహ్వానించలేదు. కాంగ్రెస్‌లోకి ఆమె రాకను ప్రస్తుత తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అడ్డుకున్న విషయం విదితమే. దీంతో చేసేదేమీ లేక, ఆమె పార్టీ ఒంటరిగా పోటీ చేస్తే ఓటమి పాలవుతామన్న ఆందోళనతో ఎన్నికల బరిలోకి దిగలేదు. దీన్ని నిరసిస్తూ షర్మిల సొంత పార్టీ నేతలే ఆమె ఇంటి వద్దకు వచ్చి ఆందోళనలు చేశారు. తర్వాత మూకుమ్మడిగా గట్టు రామచంద్రరరావు నాయకత్వంలో పార్టీ నేతలు రాజీనామాలు చేశారు. చివరికి కాంగ్రెస్‌కు తాను మద్దతిస్తున్నాని షర్మిల ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి పాలైంది. పదేళ్ల తర్వాత అక్కడ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. షర్మిల కాంగ్రెస్‌కు మద్దతిచ్చారేగానీ... ఎక్కడికీ వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేయలేదు. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు నుంచి ఇప్పటివరకు కాంగ్రెస్ నేతలెవ్వరూ ఆమెతో సంప్రదింపులు చేపట్టలేదు. తుదకు కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా రాజకీయంగా ఆమె గురించి స్పందించలేదు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నుంచి ఆమెకు ఎంపీ టికెట్ ఇస్తారన్న ప్రచారముంది. కొద్ది నెలల్లో లోక్‌సభ ఎన్నికలతో పాటు ఏపీ ఎన్నికలు జరగనున్న సమయంలో వ్యూహాత్మకంగా ఆమె లోకేశ్‌కు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలపడంపై వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జగన్ సోదరిగా షర్మిలను ఇంతవరకు అభిమానించిన వైసీపీ శ్రేణులంతా ఆమె వ్యవహారశైలిని తప్పు బడుతున్నారు. ఇప్పటివరకు ఏపీ కాంగ్రెస్ ప్రచార బాధ్యతల్ని షర్మిలకు అప్పగిస్తారని ఊహాగానాలొచ్చాయి. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఇంతవరకు ఎలాంటి నిర్ణయమూ జరగలేదు. షర్మిల ఏపీకి వస్తే ఆహ్వానిస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అయితే అసలు షర్మిల కాంగ్రెస్‌లోకి వెళ్తారా? లేక తెలంగాణలోనే ఉండి రాజకీయ కార్యకలాపాలు చేస్తారా? అనేదీ ప్రశ్నార్థకంగా మారింది. కాంగ్రెస్‌లో చేరితే... దాని ఆధారంగా ఏపీలోకి ప్రవేశించి షర్మిల ప్రచారం చేసేందుకు అవకాశం ఉంటుంది.

మూడవ రోజూ అలరించిన ‘నంది’ నాటకాలు

విశాలాంధ్ర-గుంటూరు: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టీవీ నాటకరంగ అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో గుంటూరు శ్రీబలిజేపల్లి లక్ష్మీకాంతం కళా ప్రాంగణం (శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం) లో కొనసాగుతున్న నంది నాటకోత్సవాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. మూడవ రోజు సోమవారం ఆహ్లాదకర వాతావరణంలో కళాకారులు తమ నాటికలను ప్రదర్శించారు. ప్రదర్శనలో తొలిగా సవేరా ఆర్ట్స్ సంగీత సాహిత్య నాటక సంస్థ కడప వారు సమర్పించు ‘శ్రీరామ పాదుకలు’ పౌరాణిక పద్య నాటకాన్ని ప్రదర్శించారు. రామాయణంలో పాదుకా పట్టాభిషేక ఘట్టం కావడంతో అందరూ భక్తిభావంతో తిలకించారు. అనంతరం మంచి(గుణ) పాఠం కథా సంగ్రహంను ప్రదర్శించారు. అదేవిధంగా ఝునక్ ఝునక్ పాయల్ భాజేను ప్రదర్శించారు. తరువాత ప్రదర్శించిన ‘నిశ్శబ్దమా... నీ ఖరీదెంత? నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది. తదనంతరం యథార్థ కథ ఆధారంగా రూపొందించిన ‘ఇంకెన్నాళ్లు?’ నాటకాన్ని ప్రదర్శించారు. అదేవిధంగా కళారూపాలను ఆదరించాలంటూ ప్రదర్శించిన నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రదర్శనలకు పారితోషకంతో పాటు మెమెంటో, కళాకారులకు ప్రశంసాపత్రాలను రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పోసాని కృష్ణమురళి అందజేశారు.

ప్రజాధనం దోపిడీ చేస్తున్న సీఎం జగన్

ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ ధనాన్ని రెండు రకాలుగా దుర్వినియోగం చేస్తున్నారని టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన సీఎం తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ పథకాల పేరుతో పెద్దఎత్తున స్కాంలకు పాల్పడుతున్నారని, పార్టీ కార్యక్రమాలను ప్రభుత్వ కార్యక్రమాలుగా ప్రచారం చేసుకుం టున్నారని తెలిపారు. అందుకోసం ప్రజా ధనాన్ని విచ్చలవిడిగా వినియోగిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం, జగన్ పాలనా వైఫల్యాలు అడుగడుగునా కనబడుతున్నాయని, రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన ప్రభుత్వం వెనక్కి తీసుకువెళు తోందని ఆరోపించారు. కక్షపూరిత రాజకీయాలతో కాలం వెళ్లబుచ్చుతోందని, రాష్ట్రంలో విధ్వంసాన్ని సృష్టించడం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. ప్రభుత్వం ప్రజాస్వామిక, ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోంది. ప్రభుత్వ లోపాలు ఎత్తిచూపితే, అవినీతిని ప్రశ్నిస్తే కక్షగట్టి కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినవారిని అర్ధరాత్రులు నిర్బంధిస్తున్నారు. వారిని ఊరూరా తిప్పి వేధిస్తున్నారు. పాలనా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని ఆయన ధ్వజమెత్తారు. మరోపక్క పరిశ్రమలను వెళ్లగొట్టడం, కొత్త పరిశ్రలను రాకుండా చేయడం వల్ల రాష్ట్రంలో నిరుద్యోగం తాండవిస్తోందన్నారు. రాష్ట్రానికి రావాల్సిన సుమారు లక్షా పాతిక కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి రాకుండా భయపెట్టి పారిపోయేలా చేశారు. ఆసియా పేపర్, జాకీ ఇండస్ట్రీస్, లూలూ గ్రూప్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఫ్రాంక్లిన్ అండ్ టెంపుల్, డేటా సెంటర్, అమర్ రాజా బ్యాటరీస్‌తో చేసుకున్న ఎంఓయూలు కంపెనీలు క్లోజ్ చేశాయి. దాదాపు 2 లక్షల ఉద్యోగులు రోడ్ల పాలయ్యారు. పట్టభద్రులు నిరుద్యోగంలో ఏపీ నంబర్ వన్ అని కేంద్ర ప్రభుత్వ వార్షిక నివేదికలో వచ్చింది. పిరియాడిక్ లేబర్ ఫోర్స్ నివేదిక దాన్ని స్పష్టం చేసింది. పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం రాష్ట్రంలో డిగ్రీ చదివిన వారిలో నిరుద్యోగ రేటు 24 శాతం ఉంది. ఇది నంబర్ వన్. ఆ తరువాతే ఇతర రాష్ట్రాలు. రాష్ట్రంలో రోజుకొక నిరుద్యోగి ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ప్రతి ఏడాది డీఎస్సీలు వేస్తామని హామీలిచ్చి మరిచారు. గ్రూప్ వన్, గ్రూప్ 2 పరీక్షలు లేక నాలుగేళ్లల్లో మొత్తం 1,340 మంది బలవన్మరణం పొందారు. ఇదే విషయాన్ని పత్రికలు ప్రచురిస్తే వాటిని ఎల్లో మీడియా అంటూ బురద చల్లుతున్నారని కనకమేడల విమర్శించారు.

బైజూస్ ట్యాబ్‌ల పంపిణీలో భారీ కుంభకోణం

- రూ. 1,250 కోట్ల దుర్వినియోగం
- వెంటనే విచారణ జరిపించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బైజూస్ ట్యాబుల పంపిణీలో భారీ కుంభకోణం జరిగిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల కొనుగోలు, అందులోని కంటెంట్ కొనుగోళ్లలో రూ.1250 కోట్లు దుర్వినియోగం జరిగిందన్నారు. విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావుతో కలిసి సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నిధులు ఎవరి చేతుల్లోకి వెళ్లాయో, రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేయించి... నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. మైటాస్ కుంభకోణం తరహాలో బైజూస్ కుంభకోణం ఉందన్నారు. గతేడాది 5,18,745, ఈ ఏడాది 4,34,185 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో 9,52,925 ట్యాబ్‌లను కొనుగోలు చేసిందని వివరించారు. గతేడాది శ్యామ్‌సంగ్ ఏ7 అనే మోడల్ గల ట్యాబ్ అమేజాన్ వెబ్‌సైట్‌లో కంపెనీనే రూ.11,999లకు అమ్ముతుంటే, రాష్ట్రప్రభుత్వం రూ.13,262లకు కొనుగోలు చేసిందని వివరించారు. హోల్‌సెల్ ధర రూ.9వేలు మాత్రమే ఉంటుందని చెప్పారు. ఒక్కో ట్యాబ్‌ను అదనంగా రూ.4వేలకు కొనుగోలు చేశారని విమర్శించారు. ఎన్నికలు రాబోతున్న తరుణంలో ఈ నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో విచారించాలన్నారు. బైజూస్ మూతబడితే కంటెంట్ మొత్తాన్ని మార్చాల్సి ఉంటుందని చెప్పారు. ఇప్పటికే ఈ కంపెనీ దివాళా తీసే స్థితికి వచ్చిందని విమర్శించారు. రాష్ట్రంలో టీచర్ పోస్టులు 40వేల ఖాళీలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తే... రాష్ట్రప్రభుత్వం మాత్రం ఖాళీలు 800, 4వేలు, 5వేలు మాత్రమే అంటూ రోజుకొక మాట మారుస్తోందని తెలిపారు. అధికారులపై ప్రవీణ్ ప్రకాశ్ ఒత్తిడి చేయడంతో వారు ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... 1.05లక్షల మంది అంగన్‌వాడీలు 14 రోజులుగా నిరవధిక సమ్మెను ప్రజాస్వామ్యంగా శాంతియుతంగా చేస్తున్నారని తెలిపారు. నాడు ప్రతిపక్ష నేతగా జగన్ పాదయాత్రలో తెలంగాణ కంటే అధికంగా వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఐదేళ్లు గడిచినా పెంచకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు ఆందోళనకు దిగారని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్ఠకు పోకుండా తక్షణమే అంగన్ వాడీ నేతలను చర్చలకు పిలిచి న్యాయబద్ధ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పది వామపక్ష పార్టీలు కూడా అంగన్‌వాడీ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశాయని గుర్తుచేశారు. లేదంటే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

శ్రీశైలానికి భక్తుల రద్దీ

ఏర్పాట్లు చేయడంలో అధికారుల విఫలం

విశాలాంధ్ర-శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల రద్దీ పెరిగింది. వరుసగా సెలవు దినాలు రావడంతో మూడు రోజుల నుంచి భక్తుల రద్దీ కొనసాగుతున్నప్పటికీ దేవస్థాన అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయలేక పోయారన్న విమర్శలు వెల్లువెత్తాయి. శివస్వాములకు, సామాన్యభక్తులకు దర్శనం కల్పించడంలో విఫలమయ్యారని వాపోతున్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది దురుసు ప్రవర్తనను నిరసిస్తూ శివస్వాములు క్యూలైన్లో నినాదాలు చేస్తున్నా కూడా వారి తీరు మారడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బందికి సంబంధించిన వ్యక్తులు, పలుకుబడి ఉన్న వ్యక్తులు వచ్చినప్పుడు అన్ని గేట్లు తెర్చుకుంటాయని... సామాన్య భక్తులకు, శివ స్వాములకు ఏ గేటు దగ్గరికివెళ్లినా కూడా ఉచిత క్యూ లైన్‌లోకి దారి చూపిస్తున్నారని చెబుతున్నారు. కనీసం జ్యోతిర్ముడి కలిగిన శివ స్వాముల కైనా దర్శన ఏర్పాట్లు చేయలేదని... పైగా ఎవరైనా అడిగితే రూ.500 టికెట్లు తీసుకొని రమ్మని ఆలయ సిబ్బంది దురుసుగా చెబుతున్నట్లు శివ స్వాములు తెలిపారు. డబ్బున్న వారికే శివయ్య దర్శనం అని... డబ్బులు లేకపోతే శ్రీశైలం వచ్చి శివయ్యను తాకకుండానే, చూడకుండానే దూరం నుంచి వెనుదిరిగే పరిస్థితులు ఏర్పడ్డాయంటున్నారు. గతంలో ఎన్నడూ ఈ విధంగా అధికారులు, సిబ్బంది వ్యవహరించడం చూడలేదంటున్నారు. ఇకముం దైనా దేవస్థాన అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సామాన్య భక్తులకు స్వామి అమ్మవార్ల దర్శనం సజావుగా జరిగేలా చూడాలని... క్యూలైన్లో వేచి ఉన్న భక్తులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

దస్పల్లా హిల్ రోడ్ విస్తరణ పనులు ఆపండి

- ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు
- 40 నుంచి 100 అడుగుల రహదారి విస్తరణకు జీవీఎంసీ అత్యుత్సాహానికి బ్రేక్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖలో దస్పల్లా హిల్ రోడ్డు విస్తరణ పనులు ఆపాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో 40 నుంచి 100 అడుగుల రహదారి విస్తరణకు జీవీఎంసీ అత్యుత్సాహానికి బ్రేక్ పడినట్లయింది. నగరం నడిబొడ్డున ఉన్న విలువైన దస్పల్లా భూములు పైనే బడా నేతల కళ్లు పడ్డాయి. వాటిని గత కొన్నేళ్లుగా దక్కించుకోవాలన్న వ్యూహంలో భాగంగా కొన్ని దశాబ్దాల పాటు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న దస్పల్లా భూములను భయపెట్టి వైసీపీ పెద్దలు కాజేసారని విపక్షాలు పెద్ద ఎత్తున ఆరోపిస్తున్నాయి. ఇప్పుడు ఇదే భూముల్లో 22 అంతస్తుల భారీ భవన నిర్మాణానికి ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. అందుకోసం సర్క్యూట్ హౌస్ ముందు నుంచి నేవీ హౌస్ మీదుగా గ్యాస్ గోడౌన్ వరకు ఉన్న 40 అడుగుల రహదారిని 100 అడుగులు చేయడానికి పూనుకొంటున్నారు. ఈ రహదారి విస్తరణకు రూ.4.64 కోట్లు కేటాయించారు. ఈ రహదారిలో గ్యాస్ గోడౌన్ ఎదురుగా ఉన్న నాల్కో గెస్ట్ హౌస్, పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌ను కూడా తొలగిస్తామని అధికారులు అంటున్నారు. ఈ రహదారిలో ట్రాఫిక్ రద్దీ అసలు లేకపోయినా వైసీపీ నేతలు చేపట్టే భారీ ప్రాజెక్టు కోసమే రహదారిని విస్తరిస్తున్నారని విపక్షాలు పెద్ద ఎత్తున ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దస్పల్లా హిల్స్ రోడ్డు విస్తరణ పనులు ఆపాలంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) స్పీడ్‌కు బ్రేకులు పడ్డాయి. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే, అవసరం లేకపోయినా వాల్తేరు మెయిన్ రోడ్డులో ఉన్న సర్క్యూట్ హౌస్ నుంచి నౌరోజీ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు జీవీఎంసీ చూపిస్తున్న అత్యుత్సాహంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అత్యవసర కౌన్సిల్ నిర్వహించి మరీ పనులకు ఆదేశించడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఈ మేరకు తక్షణమే పనులను నిలిపేయాలంటూ న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు ఆదేశించారు. అధికార పార్టీ నేతలకు లబ్ధి చేకూరేలా సుమారు రూ.1,000 కోట్ల వరకు టీడీఆర్‌లు జారీ చేసేందుకు జీవీఎంసీ సిద్ధం కావడం దారుణమంటూ హైకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలయింది. విశాఖపట్నంకు చెందిన స్ప్రింట్ ఎక్స్‌పోర్టు ఎండీ గుంటూరు పవన కుమార్, కె.ఎస్.నాగేంద్ర ప్రసాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేవలం జీవీఎంసీ కౌన్సిల్‌లో తీర్మానం చేసేసి, ప్రతిపక్ష నేతలు అడ్డుచెబుతున్నా వినకుండా టెండర్‌కు వెళ్లడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రైవేట్ వ్యక్తులకు సర్క్యూట్ హౌస్ ప్రాంతంలో ఉన్న ప్రైవేట్ భవనాలకు లబ్ధి చేకూర్చేందుకే రోడ్డు విస్తరణ పేరిట భూ సేకరణ చేపట్టి భారీ ఎత్తున టీడీఆర్‌లు, భూ వివాదంలో ఉన్న ఈ స్థలంలో భారీ అంతస్తుల నిర్మాణానికి అనుమతులు కూడా అందజేసేందుకే ఈ వ్యూహాన్ని కొంతమంది పెద్దలు అధికారులతో చేయిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో హైకోర్టు అక్కడ పనులు ఆపాలని ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శితో పాటు జీవీఎంసీ కమిషనర్, భూ సేకరణ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ వర్క్స్ ఎస్‌ఈకి కూడా హైకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ భూ సేకరణ పనులకు ఆఘమేఘాల మీద టెండర్ పిలవడాన్ని అన్ని వర్గాలూ తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ నెల 4న ప్రతిపాదనలను సిద్ధం చేసేయడం, 16న టెండర్ కూడా పిలిచేయడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఈ టెండర్ నోటీసును కూడా హైకోర్టు రద్దు చేసింది. రెండు వర్గాల వాదనలు విన్న కోర్టు పై విధంగా తీర్పునిచ్చింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు పనులేవీ చేపట్టొద్దంటూ కోర్టు ఆదేశించింది. ఈ మేరకు కోర్టు తరపున అసిస్టెంట్ రిజిస్ట్రార్ యు.శ్రీదేవి ఆర్డర్ ప్రతులు పంచారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో అధికారుల వైఖరిపై విపక్షాలు ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

యదేచ్ఛగా కలప అక్రమ రవాణా

విశాలాంధ్ర-దేవీపట్నం (అల్లూరి జిల్లా): తూర్పు ఏజెన్సీ రంప చోడవరం డివిజన్‌లో గత రెండు నెలలుగా యదేచ్ఛగా కలప అక్రమ రవాణ సాగుతోంది. దేవీపట్నం మండలం గోకవరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని దండంగి, పోతవరం, పోశమ్మగండి, చిన్నారిగండి అడవుల నుంచి మారుజాతి కలపను అక్రమార్కులు తరలిస్తున్నారు. అటవీ సంపదను కాపాడాల్సిన అటవీ శాఖ అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి విలువైన కలపను మైదాన ప్రాంతానికి తరలింపచేస్తున్నారు. ఏటా పొగాకు బేరన్ సీజన్ కోసం వ్యాపారులు అటవీశాఖాధికారుల అండదండలతో డిసెంబర్ నుంచి మార్చి నెలాఖారు వరకు కోట్లాది రూపాయల అటవీ సంపద మైదాన ప్రాంతాలకు తరలించేయడం పరిపాటిగా మారింది. సీజనల్ గా సీతానగరం, కోరుకొండ, గోకవరం వంటి ప్రాంతాలకు ఈ కలప అక్రమ రవాణా విరివిగా సాగుతుంది . ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయలు చేతులు మారటమే కాదు అటవీశాఖ లో కింద స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు కాసుల పంట గా ఉంటుందనే ఆరోపణలున్నాయి. ఆత్రుతగా ఈ సీజన్ కోసం అటవీశాఖ అధికారులు ఎదురు చూస్తారనడంలో అతిశయోక్తి లేదు. పోలవరం ముంపుతో ఖాళి అయినా గ్రామాలలో ఈ అక్రమ కలప రవాణా నిత్యకృత్యంగా సాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కలప అక్రమ రవాణా ను నిరోధించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రియల్టర్ మాయాజాలం

- అనుమతుల్లేకుండానే అక్రమ లేవుట్...
- ప్లాట్ల అమ్మకాలు
- పంటకాలువల ఆక్రమణ
- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: దొరికితే దొంగ దొరకకపోతే దొర అనే సామేత కొంతమంది రియల్టర్లకు అచ్చు గుద్దినట్లు సరిపోతుంది. అధికారులను సంతృప్తి పరిచి ప్రభుత్వ ఆదాయనికి గండికొట్టేయాలనే దురాశతో రియల్టర్లు బరితెగిస్తున్నారు. అనుమతులు లేకుండానే లేఅవుట్‌కు రూపకల్పన చేస్తున్నారు. పంటకాలువలను సైతం ఆక్రమించి భూమిని చదును చేసి, రోడ్లు వేసి, చుట్టూ ప్రహరీ నిర్మించి దానిలో ప్లాట్లు విక్రయానికి పెట్టిన రియల్టర్ల బరితెగింపునకు స్థానిక అధికారులు కొమ్ముకాయడం కొసమెరుపు. ఓ రియల్టర్ కశింకోట మండలం ఉగ్గినపాలెం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్లు 183/పి 189, 251/పి,447/ పి,448/పి లలో 23.2131 సెంట్లు వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. ఆ వ్యవసాయ భూములకు సాగునీరు నందించే ప్రభుత్వ పంట కాలువలను సైతం ఆక్రమించి కన్‌వర్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా... జేబులు దండిగా నింపుకున్న రెవెన్యూ అధికార్లు అవేవి పరిశీలించకుండా ఆమోదించారు. కన్‌వర్షన్‌తో పాటు అన్ని అనుమతులు ఉన్నాయనే ప్రచారం చేసుకొని లేఅవుట్‌కు రూపకల్పన చేశారు. అక్రమ లేఅవుట్‌పై కొంతమంది వ్యక్తులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా... పరిశీలించి అక్రమ లేఅవుట్‌గా నిర్ధారించారు. అన్ని అనుమతులు ఉన్నాయంటూ పంచాయతీ అధికారులను రియల్టర్ మభ్యపెట్టే ప్రయత్నం చేయగా... అనుమతులు ఉంటే తమకు సమర్పించాలని పంచాయతీ కార్యదర్శి 6 నెలల క్రితం నోటీసులు జారీ చేశారు. ఆరు నెలలుగా నోటీసులకు సమాధానం ఇవ్వకుండా ఇప్పుడు మళ్లీ కొత్తగా వీఎంఆర్డీఏ తాత్కాలిక అనుమతులు ఇచ్చిందంటూ కొత్త డ్రామకు తెరలేపారు. అక్రమ లేఅవుట్‌ను సక్రమం చేసుకోవడానికి లేఅవుట్ యాజమాన్యం తప్పులు మీద తప్పులు చేసుకుంటూ పోతున్నప్పటికీ రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. బాగా లబ్ధిపొందడం వల్లేనన్న ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చి ఆరు నెలల గడిచినా సమాధానం రాకపోతే ఎందుకు చర్యలు తీసుకోలేదు ?పంటకాలువలను ఆక్రమించారనే ఫిర్యాదులు రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖకు వెళ్లినా ఇప్పటి వరకు ఎందుకు ఆ లేఅవుట్‌ను పరిశీలించలేదో తెలియదు. జాతీయ రహదారిని ఆనుకొని నిర్మిస్తున్న లేఅవుట్‌కు నేషనల్ హైవే ఆథారిటీ నుంచి రోడ్డు ఉపయోగించుకోవడానికి అను మతులు తీసుకోవాలి, అందుకు గాను 16 అడుగుల లేఅవుట్ స్థలాన్ని నేషనల్ హైవేకి వదిలేయాలి. అలా ఎందుకు ఇవ్వలేదు? ఇవేవి లేకుండానే వీఎంఆర్డీఏ తాత్కాలిక అనుమతులు ఎలా మంజూరు చేసింది ? దీని వెనకున్న లొసుగుల బాగోతం పై జిల్లా స్థాయి అధికా రులు దృష్టి సారించి అక్రమ లేఅవుట్‌కు ఇచ్చిన తాత్కాలిక అనుమతులు రద్దు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మేం మళ్లీ వస్తాం

దోపిడీ నుండి శ్రామిక వర్గం విముక్తి పొందే వరకు మేం మళ్లీ మళ్లీ తలెత్తుతూనే ఉంటాం

1917 రష్యాలో విజయవంతమైన అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవ ప్రభావంతో 1925 డిసెంబర్ 26న కాన్పూర్ నగరంలో భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆవిర్భవించింది.

భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొంటూ రైతులు, బడుగు బలహీన వర్గాల, మహిళలు, కార్మికులు, పేద మధ్యతరగతి ప్రజానీకం కోసం మహోజ్వల పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐది.

దున్నేవానికే భూమి నినాదంతో తెలంగాణ సాయుధ పోరాటం చేసి పది లక్షల ఎకరాలను పేదలకు పంచిన చరిత్ర సీపీఐది.

దేశ సమగ్రత కోసం మా దేహం ముక్కలైనా ఈ దేశాన్ని ముక్కలు కానివ్వం అంటూ దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న ఉగ్ర మూకలకు అడ్డుగా నిలిచింది సీపీఐ.

చట్ట సభలలో సీట్లు, ఓట్లు ఉన్నా లేకపోయినా శ్రామిక జనావళి కోసం నిరంతరం పోరాడుతోంది

నేడు పెట్టుబడిదారీ విధానం ఎంత ప్రమాదకరమైందో ప్రజల బతుకులు ఎలా ఉన్నాయో భారత దేశ ప్రజలు చవిచూస్తున్నారు. భవిష్యత్తు మార్క్సిజానిదే అని ప్రజలు నమ్మే రోజు ముందుంది

అందుకే చెప్తున్నాం
మేం మళ్లీ వస్తాం

తాటిపాక మధు, సీపీఐ జాతీయ సమితి సభ్యులు

సంపాదకీయం

పోరుబాటలో సీపీఐ పాదముద్రలు

రష్యా అక్టోబర్ విప్లవంతో స్ఫూర్తి పొంది మన దేశంలో ఇరవయ్యవ శతాబ్దం రెండో దశకంలోనే అనేక మంది విప్లవబాట పట్టారు. 1925 డిసెంబర్ 26న వివిధ విప్లవకర కార్యకలాపాలను, సంస్థలను సంఘటితంచేసి భారత కమ్యూనిస్టు పార్టీ అవతరించింది. నిరంకుశత్వం, అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా గత 99 ఏళ్లుగా నిరంతరం పోరాటం కొనసాగిస్తూనే ఉంది. దైనందిన సమస్యలను పరిష్కరిచుకోవడానికి ప్రజలు కొనసాగిస్తున్న పోరాటాలతో బుజం బుజం కలిపి అడుగులేస్తూనే ఆ పోరాటాలను సరైన దిశలో నడిపించడానికి ప్రజా పోరాటాలకు ఎర్ర తివాచీ పరిచింది కమ్యూనిస్టు పార్టీ. ఈ క్రమంలో సీపీఐ అనేక త్యాగాలు చేసింది. తెలంగాణ పోరాటంతో సహా అనేక పోరాటాలలో వేలాది మంది ప్రాణ త్యాగం చేయాల్సి వచ్చింది. వలసవాదుల పాలనలో తప్పని అణచివేతలు స్వతంత్ర భారతంలోనూ ఎదుర్కోవలసి వస్తోంది. ఈ అణచివేత ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ పోరాటం పొడవునా సీపీఐ లక్షలాది మంది పారిశ్రామిక కార్మికులను, రైతులను, వ్యవసాయ కార్మికులను చైతన్య పరిచింది. సమీకృతం చేయగలిగింది. తద్వారా సమాజంలో మౌలిక మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తూనే ఉంది. సీపీఐ మతతత్వానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతూనే ఉంది. మనిషి మనిషిని దోపిడీ చేయడం అంతం చేయాలంటే సోషలిస్టు వ్యవస్థ ఏర్పడి తీరాల్సిందేనన్న వాస్తవం కమ్యూనిస్టు పార్టీకి తెలుసు. ఇది సాధ్యం కావాలంటే వివిధ వర్గాల శ్రమజీవులు తమ హక్కుల కోసం పోరాడవలసిందే. ఆ పోరాటాలకు సైద్ధాంతిక ప్రాతిపదిక సమకూర్చడంలో అపారంగా శ్రమించింది. ప్రజా సంఘర్షణలను ప్రగతిశీల మార్గంలోకి మళ్లించింది. కమ్యూనిజం విదేశీ సిద్ధాంతం అన్న ప్రతీపశక్తుల దుష్ప్రచారాన్ని ఆచరణ ద్వారా తిప్పికొట్టింది. కమ్యూనిస్టులు జాతీయ పోరాటంలోకి దూకారు. గాంధీజీ వల్లే స్వాతంత్ర్యం వచ్చిందని వాదించే వాళ్లు ఉండనే ఉన్నారు. కానీ కాంగ్రెస్‌తో సంబంధం లేకుండానే స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారు కోకొల్లలు. శాంతియుత పోరాటంవల్లే స్వాతంత్ర్యం లభించిందని నమ్మేవారు ఉండవచ్చు. ఆయుధాలు చేపట్టి, ప్రజలను విప్లవకర శక్తులుగా మార్చిన స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములైన పక్షాలు అనేకం ఉన్నాయి. గాంధీజీ నాయకత్వంలో నడిచిన జాతీయోద్యమం మొదట్లో కోరింది సంపూర్ణ స్వాతంత్ర్యం కాదు. స్వయం పాలనాధికారంతో సరిపెట్టుకోవాలన్నది కాంగ్రెస్ నాయకుల్లో అనేక మంది ఉద్దేశం. బహుశ: దీనికి మినహాయింపు పండిత్ నెహ్రూ, సుభాష్ చంద్ర బోస్ లాంటి వారు మాత్రమే. కానీ సంపూర్ణ స్వరాజ్యం కోసం మొట్ట మొదట పిలుపు ఇచ్చింది కమ్యూనిస్టు పార్టీ. హస్రత్ మోహానీ ఈ పిలుపును దిక్కులు పిక్కటిల్లేట్టు వినిపించారు. 1920ల నాటికే అంటే వ్యవస్థాపరంగా సీపీఐ సంఘటితం కాకముందే కమ్యూనిస్టు భావజాలం ఉన్న వారు దేశవ్యాప్తంగా కార్మికోద్యమాలకు నాయకత్వం వహించారు. 1920లలో మొదట కార్మిక సంఘాలు ఉద్యమ స్ఫూర్తితో ఏర్పడ్డాయి. వీటికి దన్నుగా నిలిచింది కమ్యూనిస్టులే 1928-29లో దేశవ్యాప్తంగా అనేక కార్మికోద్యమాలు చేశాయి. బొంబాయి జౌళి కార్మికులు, బెంగాల్ రైల్వే కార్మికులు చేసిన సుదీర్ఘ పోరాటాలలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర ఎన్నదగింది. ఆ శక్తుల్లో కమ్యూనిస్టు పార్టీది ప్రత్యేక స్థానం. ఆ అరుణకాంతులను విస్మరించడం సాధ్యమయ్యే పని కాదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినంత మాత్రాన ప్రజా సమస్యలన్నీ తీరిపోతాయన్న భ్రమ కమ్యూనిస్టు పార్టీకి ఏనాడూ లేదు. కమ్యూనిస్టు పార్టీ కేవలం ఒక రాజకీయ పార్టీ కాదు. అదో నిరంతర ఉద్యమం. కమ్యూనిస్టు పార్టీ ప్రభావానికి కేవలం చట్ట సభల్లో ఎన్ని సీట్లు ఉన్నాయన్నదే ప్రామాణికం కాదు. ఒక్క సభ్యుడు మాత్రమే ఉన్న రోజుల్లో కమ్యూనిస్టు పార్టీ ప్రజల వాణిని సమర్థంగా వినిపించగలిగింది. కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం కేవలం మన దేశానికే పరిమితమైంది కాదు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న అనేక విమోచనోద్యమాల్లో కమ్యూనిస్టులపాత్ర ఉంది. ఉంటుంది. కమ్యూనిస్టుపార్టీది సంకుచిత జాతీయవాద దృక్పథం కాదు. అది అంతర్జాతీయ దృక్పథం. ఈ కారణంగానే ప్రపంచంలోని ఏ దేశంలో ప్రజలు తమ హక్కులకోసం పోరాడినా కమ్యూనిస్టుపార్టీ సంతృప్తి పడడమే కాదు ఆ పోరాటాలకు బాసటగా నిలిచింది. దేశంలో కమ్యూనిస్టు భావజాలం వేళ్లూనుకోవడమే కాదు త్వరితంగా విస్తరిస్తోందని జడుసుకున్న బ్రిటిష్ వలసవాదులు 1921 నుంచి 1933 మధ్య కమ్యూనిస్టులపై అనేక కుట్ర కేసులు మోపారు. ఈ సమయంలో అనేక మంది కమ్యూనిస్టు అగ్రనాయకులు జైళ్లలో మగ్గవలసి వచ్చింది. కొందరైతే మరణ శిక్ష అనుభవించవలసి వచ్చింది. కమ్యూనిస్టు ఉద్యమాన్ని అణచివేసే ప్రధాన లక్ష్యంతోనే మోపిన మీరట్ కుట్ర కేసు మార్క్సిస్టు భావజాలాన్ని ప్రచారం చేయడానికి ఉపకరించింది. ఆ కేసు విచారణ సందర్భంగా కోర్టు గదుల్లో మార్క్సిస్టు సిద్ధాంత ప్రాధాన్యాన్ని విడమర్చి చెప్పారు. ఈ దాటికి తట్టుకోలేని ప్రభుత్వం 1934లో కమ్యూనిస్టు పార్టీతో పాటు అనేక ప్రజాసంఘాలను కూడా నిషేధించింది. కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం ఉండడమే నేరంగా పరిగణించారు. అయినా కమ్యూనిస్టులు అజ్ఞాతంలో ఉండి విశేషమైన పాత్ర పోషించి పార్టీ కార్యకలాపాలను, సభ్యత్వాన్ని కూడా విస్తరించారు. నిషేధం ఉన్న సమయంలో చాలా మంది కమ్యూనిస్టు నాయకులు కాంగ్రెస్‌లో చేరి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ అన్న విభాగాన్ని ఏర్పాటుచేసి చాలా చురుకుగా పనిచేశారు.

ప్రపంచం అంతా 1929-30లలో ఆర్థిక మాంద్యంలో ముగ్గిపోయి పెట్టుబడిదారీ విధానం దివాళాకోరుతనాన్ని నిరూపిస్తున్న తరుణంలో ప్రజలకు మార్క్సిజంపై విశ్వాసం పెరగడం మొదలైంది. 1952లో తొలి ఎన్నికలలో విజయం సాధించి చట్టసభల్లో ప్రవేశించిన వారు అధికారంలో ఉన్న పార్టీ అనేక ప్రజానుకూల శాసనాలు, విధాన నిర్ణయాలు తీసుకోవడానికి కారకులయ్యారు. వివిధ రాష్ట్రాలు, పార్లమెంటు ఏదో ఒక మేరకు భూసంస్కరణలు ప్రవేశ పెట్టడానికి కారకులు కమ్యూనిస్టులే. ఇందిరా గాంధీ హయాంలో బ్యాంకుల జాతీయకరణ, రాజాభరణాల రద్దు వంటివి అమలు కావడానికి సీపీఐ ఒత్తిడే కారణం. విదేశాల్లో ఉంటూ కమ్యూనిస్టు పార్టీ మన దేశంలో ఏర్పడడానికి ప్రేరణగా నిలిచిన ఎంఎన్ రాయ్ మెక్సికోలో కమ్యూనిస్టు పార్టీకి వ్యవస్థాపకుడయ్యారు. అదే రీతిలో పాకిస్థాన్‌లో కమ్యూనిస్టు పార్టీని నెలకొల్పడానికి ప్రసిద్ధ రచయిత సజ్జాద్ జహీర్ కారణమయ్యారు. పార్లమెంటరీ రాజకీయాలలోను కమ్యూనిస్టులు అగ్రశేణి పాత్రే నిర్వర్తించారు. గొప్ప పార్లమెంటేరియన్ల జాబితా రూపొందిస్తే అందులో ఎక్కువ మంది కమ్యూనిస్టులే ఉంటారు. హిరేన్ ముఖర్జీ, భూపేశ్ గుప్తా, ఇంద్రజిత్ గుప్తా, గురుదాస్ దాస్‌గుప్తా లాంటి పేర్లు ఆ జాబితాకు ఉదాహరణ ప్రాయం అయినవి మాత్రమే. చట్టసభల్లో సీట్ల సంఖ్య తగ్గడం కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ స్ఫూర్తికి, ప్రభావానికి నిదర్శనం ఎన్నటికీ కాలేదు. దేశ ప్రజలను అనేక రకాల దోపిడీ, అణచివేత నుంచి విముక్తం చేసే దాకా ఎర్రజెండా ధగధగలు కచ్చితంగా ఉంటాయి.

సీపీఐ ఆవిర్భావం



కమ్యూనిస్టులపై బ్రిటిషు ప్రభుత్వం రెండవ కుట్ర కేసు-కాన్పూరు కుట్ర కేసు మోపి కొందరు ముఖ్య నాయకులను అరెస్టు చేసి విచారణ జరుపుతున్న సమయంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. 1925 డిసెంబరు 25న కాన్పూరులో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ ప్రథమ మహాసభకు మైలాపురం సింగారవేలు చెట్టియార్ అధ్యక్షత వహించారు. 300 మంది ప్రతినిధులు సభకు హాజరయ్యారు. అప్పటికి దేశంలో క్రియాశీలంగా పనిచేస్తున్న బొంబాయి, కలకత్తా, మద్రాసు, లాహోర్ కమ్యూనిస్టు గ్రూపులన్నీ మహాసభకు వచ్చాయి. కార్యవర్గంలో ప్రాతినిధ్యం పొందాయి. ఆహ్వాన సంఘాధ్యక్షులైన హజరత్ మోహ స్వాగతోపన్యాసం చేశారు. సింగారవేలు చెట్టియార్ అధ్యక్షోపన్యాసం చేశారు. బ్రిటిష్ పార్లమెంట్ సభ్యుడు. బ్రిటన్‌లో ఉంటున్న భారత కమ్యూనిస్టు నాయకుడు సకలత్ వాలా పంపిన సందేశాన్ని సభా ప్రారంభంలో చదివారు. మహాసభ రెండవ రోజు డిసెంబర్ 26న చర్చించి తీర్మానాలు ఆమోదించారు. మహాసభ ఆమోదించిన తీర్మానాలలో పార్టీ పేరు 'కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ ఇండియా' అని ఉండాలా 'ఇండియన్ కమ్యూనిస్టు పార్టీ' అని వుండాలా అన్న వివాదాన్ని తేల్చే తీర్మానం ముఖ్యమైనది. మహాసభ కన్వీనర్లలో ఒకరైన సత్యభక్త కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌తో ప్రమేయం లేని విధంగా జాతీయ కమ్యూనిస్టు పార్టీ అని భావం వచ్చే విధంగా పార్టీ పేరు ఉండాలంటూ ఇండియన్ కమ్యూనిస్టుపార్టీ అన్న పేరు పెట్టాలని చేసిన ప్రతిపాదనను మహాసభ త్రోసిపుచ్చింది. జాతీయ కమ్యూనిస్టుపార్టీగా ఉంటే బహిరంగంగా పనిచేసే అవకాశాలు ఉంటాయని, బ్రిటీషు పాలకులు అటువంటి అవకాశాలు ఇస్తారనే సత్యభక్త వాదనలు వీగిపోయాయి. 'కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ ఇండియా' అన్న పేరును మహాసభ ఆమోదిం చింది. శ్రామికవర్గ అంతర్జాతీయతా స్వభావం గల కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయా దేశాల పార్టీలు అంతర్భాగాలుగా వుండాలన్న భావమే చివరకు ఆమోదం పొందింది. భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) ఏర్పడినట్లు మహాసభ అనంతరం ప్రకటన చేశారు. ఆనాడు కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో భారత ప్రతినిధిగా ఉన్న ఎంఎన్‌రాయ్ 1926 మార్చి 20న భారత కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భావాన్ని గుర్తిస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ సంస్థాపన గురించి కాన్పూర్‌లో 1925లో జరిగిన ప్రథమ మహాసభ నాడే పార్టీ సంస్థాపన జరిగినట్టు కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ గుర్తింపు పొందింది. పార్టీ అధ్యక్షులుగా ఎం.సింగారవేలు చెట్టియార్, ప్రధాన కార్యదర్శులుగా ఎస్వీ ఘాటే, జానకీ ప్రసాద్ బాగెర్ హిట్టా ఎన్నికయ్యారు. పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యాలయం బొంబాయిలో నెలకొల్పడానికి నిర్ణయించారు. కొంత కాలానికి బాగెర్ హిట్టా పోలీసు ఏజంటు అనే అనుమానం రావడంతో పార్టీ నుంచి బయటకు పంపేశారు. ఘాటే ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు. సత్యభక్త కేంద్ర కార్యవర్గానికి రాజీనామా చేసి సొంతంగా 'ఇండియన్ కమ్యూనిస్టు పార్టీ'ని పెట్టుకొన్నారు. ఆయన పార్టీని కొన్నాళ్లకే మూసేసుకున్నారు. అంతకు ముందు మద్రాసులో సింగార్ వేలు చెట్టియార్ స్థాపించిన 'లేబర్ కిసాన్ పార్టీ ఆఫ్ హిందూస్తాన్'ను కూడా కాన్పూర్ సభ అనంతరం ఆయన రద్దు చేసుకున్నారు. బాలారిష్టాలను దాటి మూడు నాలుగు యేళ్లలో భారత కమ్యూనిస్టుపార్టీ సుస్థిర పునాదులపై నిర్మాణమైంది. దేశంలోని అన్ని నిజమైన కమ్యూనిస్టు గ్రూపులను ఏకీకృతం చేయడమే గాక, సమరశీల ప్రజా పునాదిగల ట్రేడ్ యూనియన్లను, రైతు సంఘాలను నిర్మించింది. వివిధ రాష్ట్రాలలో వర్కర్స్ అండ్ పేజెంట్స్ పార్టీలను నిర్మించింది. 1928లో కలకత్తాలో జరిగిన మహాసభలో అఖిల భారత వర్కర్స్ అండ్ పేజెంట్స్ పార్టీని ఏర్పరచింది. కమ్యూనిస్టుపార్టీకి బహిరంగ వేదికగా ఇది ఏర్పాటయింది. ఆ విధంగా భారత కమ్యూనిస్టుపార్టీ దేశ స్వాతంత్ర్య సమరంలో ఒక నూతన శక్తిగా, కార్మికవర్గ నాయకత్వాన, కార్మికవర్గ దృక్పథంతో, ఒక సువిశాల సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక జాతీయ ప్రజాతంత్ర విప్లవ కార్యక్రమం ప్రాతిపదికగా సామాన్య ప్రజానీకాన్నంతనూ జాతీయ విముక్తి పోరాటంలోకినడిపించే మహత్తర శక్తిగా ఆవిర్భవించింది. కాన్పూర్లో జరిగిన ప్రథమ మహాసభ ఆ విధంగా దేశంలో సుసంఘటిత కమ్యూనిస్టు పార్టీ స్థాపనకు పునాదిరాయి వేసింది. ఆ ఆనాటికి దేశంలో వున్న నిజమైన కమ్యూనిస్టు విభాగాలన్నింటినీ సమైక్యపరచి, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంతో సౌహార్ద్ర సంబంధాలు పెట్టుకొనడానికి, శ్రామికవర్గ అంతర్జాతీయతను పాటించడానికి సంసిద్ధం కావడంవలననే దీనిని భారత కమ్యూనిస్టుపార్టీ సంస్థాపక సభగా, 1925 డిసెంబరు 26 పార్టీ సంస్థాపన దినంగా నిర్ధారించారు. అంతకు ముందు 1920 నవంబరులో తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిందని, దానినే పార్టీ సంస్థాపన దినంగా భావించాలనే వాదనలను (1964లో పార్టీ చీలిన తదుపరి కూడా కొందరు లేవనెత్తారు) పార్టీ తిరస్కరించింది. భారత కమ్యూనిస్టుపార్టీ సంస్థాపన 1925 డిసెంబరు 25నే జరిగిందనడానికి 1959 ఆగస్టు 19వ తేదీన పార్టీ కేంద్ర కార్యదర్శివర్గం ఏకగ్రీవంగా చేసిన నిర్ణయమే తిరుగులేని సాక్ష్యం.

- ఎం.లక్ష్మీరాజ్యం

భారత కమ్యూనిస్టు ఉద్యమం ఓ ఫీనిక్స్

సురవరం సుధాకరరెడ్డి
సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి

నేను ఇక్కడ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర రాయటం లేదు. భారత దేశంలో కమ్యూనిస్టు వామ పక్ష ఉద్యమం చేసిన ప్రభావం - దాని ఫలితాల గురించి క్లుప్తంగా తెలియజేయదలుచుకున్నాను.

భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ. అంతవరకు 'హోం రూల్' పేరుతో కాంగ్రెసు నాయకులపైన ప్రజల ఒత్తిడి పెరిగింది. తర్వాత అనేక సంవత్సరాలకు కాంగ్రెసు కూడా సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చింది. కార్మికులకు, రైతులకు, విద్యార్థులకు తమ హక్కుల కోసం పోరాడేందుకు స్వతంత్ర ప్రజాసంఘాలను నిర్మించి ప్రశ్నించే హక్కు ఉద్యమాలను నిర్మించి, సాధించేందుకు మార్గదర్శకత్వం వహించింది.

మార్క్సిజం-లెనినిజం సిద్ధాంత ప్రాతిపదికన, అక్టోబరు మహావిప్లవ స్ఫూర్తితో ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ, కొద్ది డజన్ల యువ విప్లవ యువకులతో ప్రారంభమై, కుట్ర కేసులతో జైళ్లపాలై, కొన్ని వందలమందికి విస్తరించి, వేలు, లక్షల సంఖ్యలోకి పెరిగి భారతదేశంలో ఒక ప్రధాన రాజకీయపార్టీగా, ఉద్యమాల, త్యాగాల పార్టీగా మారింది.

కేరళలోని పొన్నప్రా-వయోలార్ పోరాటాన్ని నడిపింది. అత్యంత నిరంకుశ, ఫ్యూడల్ సంస్థానంగా ఉన్న నైజాం సంస్థాన ప్రభుత్వానికి వ్యతిరేకంగా మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చేపట్టింది. 4,500 పైగా కమ్యూనిస్టులు తమ రక్తంతో, తమ కుటుంబాల కన్నీళ్లతో తెలంగాణ గడ్డను తడిపి, ఫ్యూడలిజం నుండి విముక్తి చేసింది.

సుప్రసిద్ధ జర్నలిస్టు, ప్రఫుల్ బిద్వాయి 'ది ఫీనిక్స్ మూవ్‌మెంటు' పేర భారత కమ్యూనిస్టు వామపక్ష ఉద్యమంపైన ఒక విమర్శనాత్మకమైన పుస్తకం వ్రాసారు. ఈ పుస్తకం ప్రచురణ ఆయన మరణానంతరం పూర్తయింది. ఆయన అనేక గ్రంథాల రచయిత. ఇందులో ప్రధానంగా ప్రధాన రాజకీయ స్రవంతిలో ఉన్న రెండు కమ్యూనిస్టు పార్టీల గురించి వ్రాస్తూ, అనేక నక్సలైటు పార్టీల గురించి, కమ్యూనిస్టేతర సోషలిస్టు ఉద్యమం గురించి కూడా రేఖా మాత్రంగా వివరించాడు. కమ్యూనిస్టు పార్టీల సుదీర్ఘ ప్రయాణంపై అనేక సానుకూల అంశాలతోపాటు అతి ఘాటైన విమర్శలు చేశారు.

భారతదేశంలో ఇతర శ్రామికవర్గాల, మధ్యతరగతి సంఘాల మిలిటెంటు పోరాటాలతో పాటు, సాహిత్య, సాంస్కృతిక కళారంగాలలో తెచ్చిన అద్భుతమైన ప్రగతిశీల ప్రభావాన్ని, పదుల లక్షల ప్రజలపై వాటి శక్తిమంతమైన ప్రభావాన్ని వివరించారు. అనేక చారిత్రక తప్పిదాల వల్ల, భారతదేశ చారిత్రక పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిజాన్ని అన్వయించడంతో, స్వతంత్ర నిర్ణయాలు సరైన సమయంలో తీసుకోలేకపోవడంవల్ల నష్టపోయారని నిర్దాక్షిణ్యంగా విమర్శించారు.

ఫీనిక్స్ అంటే ఏమిటి?

రోమన్, ఈజిప్టు, గ్రీకు (మైథాలజి) పురాణాల ప్రకారం, ఫీనిక్స్ అనే అందమైన రంగుల పక్షిని చంపినా, కాల్చి బూడిద చేసినా అ బూడిదలోంచి మళ్లీ పునరుజ్జీవనం పొందుతుందని, భయమెరుగని, శక్తిమంతమైన పోరాడే జీవి అని నమ్ముతారు. ఇదొక ఆధారంలేని నమ్మకంకావచ్చు, మూఢనమ్మకం కావచ్చు. కాని కమ్యూనిస్టు ఉద్యమాన్ని దీనితో పోల్చడం అద్భుతమైన పోలిక. ఈ పోలిక చూడగానే నాకు కొన్ని దేశాల కమ్యూనిస్టు పార్టీల పరిణామాలు గుర్తుకు వచ్చాయి. రష్యా, చైనాల తర్వాత ప్రపంచంలో అతి పెద్ద పార్టీ ఇండోనేషియా కమ్యూనిస్టు పార్టీ. 10 లక్షలమంది కమ్యూనిస్టులను సైనికాధిపతి సుహార్తో ఒక రాత్రి నిర్దాక్షిణ్యంగా హత్య చేస్తే పార్టీ ఇప్పుడు మళ్లీ ఆవిర్భవించింది. మైకార్థియిజంను ఎదుర్కొని అమెరికన్ కమ్యూనిస్టు పార్టీ పునరుజ్జీవనం పొందింది. వేలాదిమందిని చంపినా ఇరాక్ పార్టీ పెరిగింది.

కమ్యూనిస్టు పార్టీలు అసాధారణమైన వర్గ పోరాటాల పార్టీ. గత 98 సంవత్సరాలుగా అనేక దక్కామొక్కీలు, నిమ్నోన్నతులు చూసింది. పదుల వేల సంఖ్యలో కార్య కర్తలు, నాయకులు జైళ్లలో నిర్బంధించబడ్డారు. హింసకు గురయ్యారు. ఈ ఉద్యమాల వల్ల వేలాదిమంది అమరుల య్యారు. తప్పుడు కేసులకు గురయ్యారు. కుటుంబాల నుండి దూరమయ్యారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదం, ఆ తర్వాత స్వాతంత్ర్యానంతరం పెట్టుబడిదారి, మతోన్మాద రాజకీయపార్టీలు క్రూర నిర్బంధానికి గురయ్యారు. కాని ఒక రాజకీయ శక్తిగా నిలదొక్కుకున్నారు. తప్పులు సరిచేసుకుని ఐక్య ఉద్యమాలు నిర్మించారు. ఓటమిల నుండి, కష్టాల నుండి పోరాట వీరుల సమాధుల నుండి మళ్లీ అరుణపతాకం సగర్వంగా ఎగిరింది.

1990వ దశకంలో సోవియట్ యూనియన్, సోషలిస్టు దేశాల క్యాంపు పతనమైన తర్వాత, ప్రపంచంలో అనేక దేశాలలో కమ్యూనిస్టుపార్టీలు అచేతనమయ్యాయి. అతి వేగంగా విచ్ఛిన్నమయ్యాయి. పశ్చిమ యూరోపు దేశాలలో అత్యంత బలవత్తరమైన ఇటాలియన్, ఫ్రెంచి, స్పెయిన్ కమ్యూనిస్టు పార్టీలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒకప్పుడు ఇటలీలో మూడవవంతు ఓట్లు పొందిన ఇటాలియన్ కమ్యూనిస్టుపార్టీని రద్దు చేసుకొని, "పార్టీ ఆఫ్ ది లెఫ్ట్" పేరుతో రూపాంతరం చెందినా ప్రభావం చూపలేదు. మళ్లీ పునరుజ్జీవనం చెందిన "రీ జనరేషన్ కమ్యూనిస్టుపార్టీ" ప్రారంభమై చీలికకు గురైనా, గుర్తింపు గలిగిన పార్టీగా పోరాటాలు నడుపుతోంది. సోవియట్ పతనానంతరం ప్రపంచంలో అనేక కమ్యూనిస్టు పార్టీలు తీవ్రంగా నష్టపోతే భారతదేశంలో ప్రధానస్రవంతి కమ్యూనిస్టుపార్టీలు దుష్ప్రభావాన్ని తట్టుకుని, నిలదొక్కు

కోవడమేగాక మరిన్ని ఉద్యమాలు, పోరాటాలు నడిపిందని, పార్టీ సభ్యత్వాన్ని గణనీయంగా పెంచుకుందని, ప్రజా సంఘాలను బలవత్తర సంఘాలుగా మార్చి మిలిటెంటు ఉద్యమాలను నడిపిందని 'ది ఫీనిక్స్ మూవ్‌మెంటు' రచయిత ప్రఫుల్ బిద్వాయ్ వివరించారు. పశ్చిమబెంగాల్, త్రిపుర, కేరళ రాష్ట్రాలలో బూర్జువ ఎన్నికలలో గెలిచి సుదీర్ఘకాలం పరిపాలన సాగించడం గురించి వివరించారు. ఈ రాష్ట్రాలలో శ్రమజీవుల, రైతులు, వ్యవసాయ కూలీలకు అనుకూలంగా చట్టాలుచేసి కమ్యూనిస్టు ప్రత్యామ్నాయాన్ని రుజువుచేశారు. భారత రాజకీయ అజెండాను మార్చడంలో నిర్ణయాత్మక పాత్ర నిర్వహించారు. రాజ భరణాల రద్దు, బ్యాంకుల జాతీయ కరణ, బొగ్గగనుల జాతీయకరణను, మహాత్మా గాంధీ గ్రామీణ పథకాన్ని, సమాచార హక్కు చట్టాన్ని సాధించారు. 2004లో 61మంది కమ్యూనిస్టు పార్టీ పార్లమెంటు సభ్యులు మతోన్మాద రాజకీయపార్టీ అధికారంలోకి రాకుండా యూపీఏ ప్రభుత్వానికి బైటనుండి మద్దతునిచ్చారు. బలమైన ప్రభుత్వరంగాన్ని దేశంలో ఏర్పాటు చేసేందుకు, కార్మిక శ్రేణులకు మెరుగైన వేతనాలు, ఉద్యోగభద్రత, సామాజిక భద్రత సాధించారు. 1957లో ప్రపంచంలో మొదటిసారి బూర్జువా ఎన్నికలలో కేరళలో గెలిచి, రికార్డు సృష్టించిన నాటి నుండి నేటివరకు శక్తిమంతమైన పాత్ర నిర్వహించేందుకు యావచ్ఛక్తితో కృషి చేస్తూనే ఉన్నారు.

భారతదేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలలో శాసనసభల్లో కమ్యూనిస్టుపార్టీ ప్రాతినిధ్యం ఉండేది. ప్రస్తుతం ఎలక్షన్ కమిషన్‌వారి జాతీయ గుర్తింపును సీపీఐ కోల్పోయింది. ఇది కేవలం సాంకేతికమైన విషయం మాత్రమే. ఆరులక్షల యాభైవేల సభ్యత్వంతో అండమాన్, నికోబార్, లక్ష ద్వీపాలతో సహ కమ్యూనిస్టు పార్టీకి వేలాది శాఖలున్నాయి. దాదాపు 3 కోట్లమంది కమ్యూనిస్టులు పనిచేస్తున్న ప్రజా సంఘాలున్నాయి. వారందరు కమ్యూనిస్టులు కాదు. అవి స్వతంత్ర ప్రజాసంఘాలు. వారి సమస్యలతోపాటు, జాతీయ సమస్యలు, ప్రభుత్వరంగ పరిరక్షణ, ధరల సమస్యలపై కూడా ఈ ప్రజాసంఘాలు పోరాడుతున్నాయి. మరింత రాజకీయ చైతన్యం పెంపొందించాల్సిఉంది. సీపీఎం మరింత సభ్యత్వంతో ప్రజాసంఘాలతో పెరిగింది.

మా తాతల నేతులు తాగారు. మా మూతులు వాసన చూడండని చెప్పేందుకు ఇది రాయడంలేదు. మన రాజకీయశక్తి సన్నగిల్లిన మాట నిజమే. కాని కమ్యూనిస్టు, వామపక్షాలు, రాజకీయప్రభావం ప్రగతిశీల ప్రజల మీద, మేధావుల మీద, రచయితలమీద ఈనాటికి ఉంది. గత ఆరు దశాబ్దాలలో కమ్యూనిస్టులు, కులవివక్షకు, అంటరానితనానికి వ్యతిరేకంగా మహత్తర పోరాటాలు నడిపారు. పెద్ద సంఖ్యలో కులాంతర వివాహాలు నిర్వహించారు. మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడి దేశంలో ఒక నూతన సామాజిక మార్పును సాధించారు. శాస్త్రీయ విజ్ఞానాన్ని విస్తృతం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు కమ్యూనిస్టులను తీవ్రంగా ద్వేషిస్తారు. కమ్యూనిస్టులను చూసి భయపడతారు. ఈ రోజున ఫాసిస్టు కార్పొరేటు అనుకూల మతోన్మాద పార్టీని, మన దేశంలో ఎదుర్కొనాల్సిన చారిత్రక బాధ్యత కమ్యూనిస్టుల మీద ఉంది. ఇది సాధ్యమా! సాధ్యమే. ప్రత్యామ్నాయం సాధ్యమేనా? తాత్కాలికంగా మత ప్రభావంతో ప్రజలలో గణనీయమైన భాగం బీజేపీతో ఉండవచ్చు. కాని ప్రజలలో మెజారిటీ ప్రజాస్వామ్య భావాలు కలవారు, వారిని సమీకరించేందుకు కమ్యూనిస్టులు ఇరుసుగా విశాల ప్రజా ఐక్యత సాధించాలి. సైద్ధాంతికంగా శాస్త్రీయ అవగాహన ఉన్న కమ్యూనిస్టులు మాత్రమే ఈ పోరాటం చేయగలరు. దేశంలో ఉన్న అన్ని కమ్యూనిస్టు, వామపక్షాల ఐక్యత, కనీసం ఐక్య కార్యాచారణ ప్రజలలో, ప్రతిపక్షాలలో విశ్వాసం కలిగిస్తుంది. కమ్యూనిస్టేతర సోషలిస్టు శక్తులు కుటుంబపార్టీలుగా మారినా బీహార్, ఉత్తరప్రదేశ్‌లాంటి రాష్ట్రాలలో శక్తిమంతమైన ప్రాంతీయపార్టీలుగా ఉన్నాయి. తమిళనాడులో మతోన్మాద, కులోన్మాద వ్యతిరేక పార్టీలు అధికారంలోను, ప్రతిపక్షంలోను ఉన్నాయి. బీజేపీ వ్యతిరేక సెంట్రిస్టు పార్టీలు ఉన్నాయి. వీటన్నింటిని సమైక్యం చేయాలి. సమావేశాల ద్వారా మాత్రమే ఈ ఐక్యత రాదు. ఉద్యమాలు, పోరాటాల ద్వారా ఐక్యకార్యాచరణ ద్వారా ఎంత పరిమితమైనదైనా సాధించాలి. దీనికి ముందు షరతు సూత్రబద్ధమైన కమ్యూనిస్టు ఐక్యత. గతం తప్పుకోకుండా దేశం కోసం, ప్రజల కోసం, ప్రజాస్వామ్య రక్షణ కోసం, ఐక్యకార్యాచరణకు పూనుకుందాం. కమ్యూనిస్టులతోపాటు, విప్లవ పార్టీలు, మేధావులు ఈ దిశగా ఆలోచించాలి. 99 సంవత్సరాల గర్వకారణమైన, పోరాటాల చరిత్ర, అణువణువునా, రక్త తర్పణచేస్తూ సాగుతున్న మన కమ్యూనిస్టుపార్టీలు ఈ అంశంపై వేగంగా స్పందించాలి. ఎర్ర జెండాల ఐక్యతకోసం, మార్క్సిజం బాటలో దోపిడి వ్యవస్థను నిర్మూలించేవైపుకు పార్టీ వార్షికోత్సవం సందర్భంగా ప్రతినచేద్దాం.

భారతకమ్యూనిస్టు పార్టీ వర్థిల్లాలి.
వామపక్షాల ఐక్యత వర్థిల్లాలి.
సెక్యులర్ ప్రజాతంత్ర ఐక్యత వర్థిల్లాలి.

త్యాగాలకు పుట్టినిల్లు సీపీఐ

మోదుమూడి మురళీకృష్ణ

పరాయి పాలనకు వ్యతిరేకంగా దేశం జరుపుతున్న పోరాట కాలంలో, సకల పీడిత ప్రజలకు నూతన మార్గాన్ని తెలియజెప్పిన మహత్తర అక్టోబరు సోషలిస్టు విప్లవ ప్రభావంతో భారత కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భవించింది. శ్రామిక ప్రజల సమరశీల, వర్గపోరాటాల వెల్లువలో, రైతులు, విద్యార్థుల పోరాటాలలో అభివృద్ధి చెందింది. వెల్లువలా సాగిన సమ్మెలు, భూస్వామ్య వ్యతిరేక కార్యాచరణలు, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా నిర్వహించిన బహిష్కరణలు, హర్తాళ్లతో ఆరితేరింది. సమరశీల దేశభక్తి, అంతర్జాతీయతావాదం, జాతీయ విముక్తి పోరాటాలు, సోషలిజం కోసం జరిగిన వర్గ పోరాటాల సమ్మేళనం నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. అనేక పాయలుగా వున్న విప్లవ స్వాతంత్ర్య సమరయోధుల సంగమంగా పార్టీ మారింది. ఈ స్వాతంత్ర్య సమరయోధులు మరణాన్ని చిరునవ్వులతో కౌగలించుకొని అమరులయ్యారు. దీర్ఘకాలం పాటు జైలుశిక్షలు, చిత్రహింసలు అనుభవించారు. మార్క్సిజం సిద్ధాంతంవైపు ఆకర్షితులయ్యారు. సోషలిజం అన్న పవిత్ర లక్ష్యంతో స్ఫూర్తిని పొందారు. కార్మికవర్గాన్ని, ఇతర శ్రమజీవులను వారి వారి ప్రజాసంఘాలలో, వర్గ సంఘాలలో, సంఘటిత పరిచే కర్తవ్యానికి వారు తమంత తాముగా పునరంకితం అయ్యారు. తద్వారా మెరుగైన జీవనం, ప్రజాతంత్ర హక్కుల కోసం పోరాడే విధంగా వారు చేశారు. ఈ భూతలం పై గల వంచితులు, తాడిత పీడితులు, దౌర్భాగ్యుల మధ్యకు పార్టీ చొచ్చుకొని వెళ్లింది. సామాజిక విముక్తి బావుటాను ఎగురవేసింది.

స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ అత్యంతదృఢమైన, నిర్మాణాత్మకమైన శక్తిగా జాతీయ ఐక్యతా లక్ష్యం కొరకు పోరాడింది. జాతీయ సర్దుబాటు కొరకు ప్రచారం చేసింది. ముస్లింలీగ్ వేర్పాటువాదుల ఉధృతి సందర్భంగా ముస్లిం ప్రజలతో సంబంధాల కొరకు పిలుపు నిచ్చింది. గాంధీ-జిన్నా తిరిగి కలుసు కోవాలని విజ్ఞప్తి చేసింది. దేశవిభజన సందర్భంలో బలవంతపు వలసలకు వ్యతిరేకంగా చేసిన ప్రచారోద్యమం, పాకిస్తానీ సాయుధ దళాలు గిరిజనుల ముసుగులో కాశ్మీరీ లోయపై దాడిచేసినప్పుడు మహారాజా జమ్మూ పారిపోగా, పౌరరక్షణ దళాల ఏర్పాటుకు సల్పిన కృషి, భారత రిపబ్లిక్ లౌకిక రాజ్యాంగం కొరకు చేసిన పోరాటం - భారత దేశ రాజకీయ వ్యవస్థలో లౌకిక భావాలు పెంపొందించేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన పోరాటానికి సాక్ష్యాలు. భారత జాతికి లౌకికతత్వాన్ని కల్పించేందుకు సీపీఐ చేసిన దోహదం, ఆర్‌ఎస్‌ఐ తిరుగుబాటుదారులు కాంగ్రెస్, ముస్లింలీగ్ పతాకాలతో పాటు ఎర్రజెండా ఎగురవేసినప్పుడు బాగా గుర్తింపు పొందింది. స్వాతంత్ర్యానంతరకాలంలో కూడా లౌకిక పరి రక్షణకు సీపీఐ అవిశ్రాంతంగా పోరాడుతూనే ఉన్నది. స్వాతం త్ర్యానంతరం ప్రజాతంత్ర విప్లవాన్ని పరిపూర్తి చేయటానికి, న్యాయసమ్మతమైన సోషలిస్టు సమాజం దిశగా ముందుకు సాగటానికి కార్యక్రమాన్ని, కార్యకలాపాలను మరింత విస్తృతం చేసింది. ఇటువంటి సమాజం కులం, వర్గం, లింగ ప్రాతిపదిక గల అన్ని రకాల దోపిడీని అంతం చేస్తుంది. అలాగే అటువంటి సమాజంలో లక్షలాది మంది శ్రమజీవులు సృష్టించిన సంపదను కొద్దిమంది మాత్రమే స్వాహా చేయటానికి వీలు ఉండదు. ఈనాడు పోరాటం మరింత తీవ్రతరమైంది. మరింత ఉధృతంగా మారింది. మరింత

> భారత కమ్యూనిస్టు పార్టీ పుట్టినప్పటి నుంచీ అన్ని రూపాలలో వున్న దోపిడీకి, సామాజిక పీడనకు వ్యతిరేకంగా తన వాణిని వినిపిస్తూనే వుంది. సమానత్వం, సామాజిక న్యాయం కోసం తన గళం వినిపిస్తూనే వుంది. ప్రజల హక్కుల పరిరక్షణ సందర్భంగా వేలాది మంది పార్టీ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పోలీసుల, భూస్వాముల, పెట్టుదారుల కిరాయిహంతకుల తూటాలకు, లాఠీలకు సమిధలయ్యారు. ఇది అమర వీరుల పార్టీ, త్యాగాలకు పుట్టినిల్లు అయిన పార్టీ, అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్న పార్టీ. అయితే ఇవన్నీ ఒక ప్రయోజనాన్ని ఉద్దేశించినవే. బ్రిటీష్ సామ్రాజ్యవాదుల పాలనను కూల గొట్టటం కోసం, భారతదేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ప్రప్రథమంగా పిలుపుయిచ్చిన పార్టీ యిదే. వాటిని తన డిమాండ్‌గా 1929లో కాంగ్రెస్ పార్టీ ఆమోదించటానికి కొన్ని సంవత్సరాల ముందుగానే భారత కమ్యూనిస్టు పార్టీ పై పిలుపు యిచ్చింది. సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాతంత్ర విప్లవ సమగ్ర కార్యక్రమంతో ప్రప్రథమంగా ముందుకు వచ్చినపార్టీ సీపీఐ.

సంక్లిష్టంగా తయారైంది. ఈ పోరాటాలలో పార్టీ నిర్విరామంగా పాల్గొంటూ ఉన్నది. సకల మతోన్మాద, విభజనవాద శక్తులకు వ్యతిరేకంగా, అన్ని రకాలైన సనాతన వాదానికి (మైనారిటీ సనాతన వాదం కావచ్చు లేదా మెజారిటీ సనాతన వాదం కావచ్చు) వ్యతిరేకంగా పార్టీ నిలకడగా, ఎల్లవేళలా పోరాడుతూ ఉంది. అల్లర్లను నివారించటానికి, అమాయక ప్రజలు ప్రత్యేకించి ఇటువంటి అల్లర్లలో లక్ష్యాలుగా ఉన్న మైనారిటీల ప్రాణాలను, ఆస్తులను రక్షించటానికి ఎక్కడ వీలైతే అక్కడ జోక్యం చేసుకోవటానికి కమ్యూనిస్టులు ప్రయత్నించారు. ఇందుకోసం కొన్ని సందర్భాలలో వారు తమ ప్రాణాలనే అర్పించారు. ఇటువంటి అల్లర్లన్నింటిలో, ఇతర విపత్తులలో దెబ్బతిన్న ప్రజలకు సహాయాన్ని అందజేయటానికి, పునరావాసం కల్పించటానికి కమ్యూనిస్టులు ఎంతగానో శ్రమించారు. పంజాబ్‌లో ఖలిస్తాన్ టెర్రరిస్టులను పార్టీ ఎంతో ధైర్యసాహసాలతో ఎదిరించింది. ఈ పోరాటంలో వందకు పైగా కమ్యూనిస్టులు తమ ప్రాణాలను అర్పించారు. సంఘ పరివార్ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, విధ్వంసానికి బాబ్రీ మసీదును లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు, వారి వ్యతిరేక పోరాటంలో కమ్యూనిస్టులు అగ్రభాగాన నిలిచారు. ప్రజా జీవనంలో విలువలను, నిజాయితీని పార్టీ ఎల్లవేళలా సమున్నతంగా నిలిపింది. ఉన్నత స్థాయిల్లో అవినీతిని, ధనబలం, కండబలం మధ్య సంబంధాలను, బూర్జువా రాజకీయ నాయకులు, నేరస్తులు, నిరంకుశ అధికారులు, పోలీసుల మధ్య బ్రహ్మముడిని ఎండగట్టింది. వీటన్నింటిపై పార్టీ పోరాడుతూనే ఉన్నది. అలాంటి పోరాటం లేకుండా ప్రజాస్వామ్యం లేదు, సోషలిజం లేదన్నది పార్టీ ప్రగాఢ విశ్వాసం. అందరికీ విద్య, అందరికీ ఉద్యోగాలు అన్న నినాదం క్రింద విద్య, ఉపాధికోసం పోరాటాలను నిర్వహిం చేందుకు పార్టీ ప్రాధాన్యత యిస్తూ వున్నది. శ్రామిక ప్రజల ప్రయోజనాలు, దేశ ప్రయోజనాలకంటే ఎక్కువ లేదా భిన్నమైన ప్రయోజనాలు కమ్యూనిస్టుపార్టీకి ఇసుమంతైనా లేవు. మన దేశానికి, అందులో నివసిస్తున్న కోట్లాది మంది ప్రజలకు సముజ్వల భవిష్యత్తు వుందన్న ఆశాభావాన్ని సీపీఐ కలిగించ గలగడం పార్టీ కార్యకర్తలుగా మనందరికీ గర్వకారణం.

దేశంలో వినాశకర విధానాలను అనుసరిస్తున్న మోదీ సర్కార్‌ను గద్దెదించాల్సిన అవసరం నేడు ఎంతో ఉన్నది. ఇటువంటి తరుణంలో మన పార్టీ దేశంలోని వామపక్షశక్తుల ఐక్యత కోసం నిలకడగా కృషి చేస్తూ వున్నది. పార్టీలో చీలిక కమ్యూనిస్టు ఉద్యమాన్ని దెబ్బతీసింది. అయితే పర్యవసానాలను అధిగమించటానికి, మతోన్మాద, విచ్ఛిన్నకర శక్తులను ఓడించటానికి సూత్రబద్ధ ప్రాతిపదికన కమ్యూనిస్టు ఐక్యతకు, ఉమ్మడి కనీస కార్య క్రమం ప్రాతిపదికగా వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యతకు పార్టీ కట్టుబడి వున్నది. గత 99 సంవత్సరాలలో మన లక్ష్యాలకు అనుగుణంగా మనం చేసిన దోహదకాలు చాలా ముఖ్యమైనవి. మన దేశ రాజకీయాలను, దాని భవితను ప్రభావితం చేశాం. మన పోరాటాలు, త్యాగాలు వృథా కాలేదు. కమ్యూనిస్టు పార్టీ లేకపోయినట్లయితే ప్రజా సంఘాలు బలహీనంగా, పటుత్వంలేనివిగా, చుక్కాని లేని నావలాగా వుండేవి. మన ముందున్న ప్రతిబంధకాలు చాలా పెద్దవి. సమస్యలు బృహత్తరమైనవి. వాటిని మనం అధిగమించగలం. లక్ష్యాన్ని చేరుకోవటానికి దగ్గరదోవగాని, సుఖమైన మార్గంగాని లేదు. సూత్రాలను ఫణంగా పెట్టి సాధించిన స్వల్పకాలిక ప్రయోజనాలు అంతిమంగా భారీ నష్టాలకే దోహదం చేస్తాయి అందువల్ల స్వల్పకాలిక ప్రయోజనాలకోసం మనం ఎదురుచూడం. పరాజయాలను, నిరాశా నిస్పృహలను తట్టుకొని మనం నిలబడగలిగాం. మన ఆశాభావం ఫలితాలనిస్తున్నది. సోషలిజం అంతమైందని, మార్క్సిజానికి కాలం చెల్లిందని చెపుతూ ఆనందంతో గావుకేకలు పెట్టినవారు ఈనాడు కలవరం చెందుతున్నారు. ఆశ్చర్యచకితులౌతున్నారు. వారు చెప్పింది పొరపాటని రుజువైంది. ఈ 99వ వార్షికోత్సవం సందర్భంగా బలోపేతమైన, ప్రజా బాహుళ్యానికి సన్నిహితమైన, సంకల్పంలో దృఢత్వం, సైద్ధాంతిక నిబద్ధతలో స్థిరత్వం, మన నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిజాన్ని వర్తింపజేయటంలో పరిణతిగల పార్టీని నిర్మించటానికి ప్రతిన బూనుదాం.

కశ్మీర్‌పై మంచు దుప్పటి

- కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు
- అత్యంత శీతల ప్రదేశం పహల్గామ్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో మంచు దుప్పటి పరుచుకుంది. సోమవారం తెల్లవారుజామున లోయలో దట్టమైన పొగమంచు రోజువారీ జీవితానికి అంతరాయం కలిగించినప్పటికీ, కశ్మీర్‌లోని చాలా ప్రాంతాలలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా రెండవ రాత్రి కూడా తగ్గుముఖం పట్టాయని అధికారులు తెలిపారు. జమ్మూకశ్మీర్ వేసవి రాజధానిలో శ్రీనగర్‌లో మైనస్ 2.3 డిగ్రీల సెల్సియస్ నమోదయింది. ఇది మునుపటి రాత్రి మైనస్ 2.1 డిగ్రీల నుండి కొద్దిగా తగ్గింది. దక్షిణ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గామ్, వార్షిక అమర్‌నాథ్ యాత్రకు బేస్ క్యాంప్‌లలో ఒకటిగా ఉంది. ఇక్కడ కనిష్ఠ ఉష్ణోగ్రత మైనస్ 4.3 డిగ్రీల సెల్సియస్. మునుపటి రాత్రి మైనస్ 3.9 డిగ్రీల సెల్సియస్ నుంచి తగ్గింది. ఇక కశ్మీర్ లోయలో పహల్గామ్ అత్యంత శీతల ప్రదేశం అని అధికారులు తెలిపారు. బారాముల్లా జిల్లాలోని ప్రసిద్ధ స్కీ రిసార్ట్ గుల్మార్గ్‌లో మైనస్ 2.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. ఖాజిగుండ్‌లో మైనస్ 2.6 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, కోకెర్‌నాగ్‌లో మైనస్ 1.6 డిగ్రీలు, కుప్వారా మైనస్ 3.0 డిగ్రీలుగా ఉంది. సోమవారం తెల్లవారుజామున శ్రీనగర్‌ను దట్టమైన పొగమంచు చుట్టుముట్టింది. ఇది ప్రజల రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసింది. ఉదయం పూట సాధారణం కంటే రద్దీ తక్కువగా ఉండగా, దృశ్యమానత తగ్గిపోవడంతో వాహనాలు తక్కువ వేగంతో వెళ్లడం కనిపించింది. పొగమంచు కారణంగా శ్రీనగర్‌లో ఉదయం 8.30 గంటలకు దృశ్యమానత 91 మీటర్లుగా నమోదయింది. దృశ్యమానత తక్కువగా ఉన్నందున వాహనదారులు జాగ్రత్తగా నడపాలని స్థానిక వాతావరణ శాఖ అధికారి సూచించారు. దేశ రాజధానిలో దృశ్యమానత సరిగా లేకపోవడంతో దిల్లీ నుంచి వచ్చే కొన్ని విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని శ్రీనగర్ విమానాశ్రయ అధికారి తెలిపారు. 'మాకు ఇటువైపు ఎలాంటి సమస్యలు లేవు. కానీ దిల్లీలో దట్టమైన పొగమంచు కారణంగా శ్రీనగర్‌కు వెళ్లే కొన్ని విమానాలు ఆలస్యం అయ్యాయి' అని వివరించారు. భారత వాతావరణ శాఖ ప్రకారం, ఉదయం 8.30 గంటలకు దిల్లీలోని పాలెం చుట్టుపక్కల దృశ్యమానత సున్నాగా ఉంది. కశ్మీర్ ప్రస్తుతం 'చిల్లా-ఇ-కలాన్' శీతాకాలపు మంచుతో నిండిన పట్టులో ఉంది. 40-రోజుల అత్యంత కఠినమైన శీతాకాలం, చలి అలలు ఈ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. ఉష్ణోగ్రత గణనీయంగా పడిపోతుంది. ఇది దాల్ సరస్సుతో సహా లోయలోని అనేక ప్రాంతాల్లో నీటి సరఫరా లైన్లతో పాటు నీటి వనరులను గడ్డకట్టడానికి దారితీస్తుంది. ఈ కాలంలో హిమపాతం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే, చాలా ప్రాంతాలు, ముఖ్యంగా ఎత్తయిన ప్రాంతాలు భారీ మంచు ప్రభావాన్ని కలిగి ఉంటాయి. 'చిల్లా-ఇ-కలన్' జనవరి 31తో ముగుస్తుంది. అయితే, చలి పరిస్థితులు ఆ తర్వాత 20 రోజుల 'చిల్లా-ఇ-ఖుర్ద్' (చిన్న చలి), 10 రోజుల 'చిల్లా-ఇ-బచ్చా' (శిశువు జలుబు)తో కొనసాగుతాయి.

పంజాబ్... హరియాణాలో పొగమంచు

చండీగఢ్: పంజాబ్, హరియాణాలోని చాలా ప్రాంతాల్లో పొగమంచు ఆవరించింది. సోమవారం తెల్లవారుజామున రెండు రాష్ట్రాల్లోని చాలా చోట్ల పొగ మంచు కారణంగా దృశ్యమానత తగ్గింది. సిర్సా, భివానీ, అమృత్‌సర్, లూథియానా, పాటియాలాలో దట్టమైన పొగమంచు ఉందని ఇక్కడి వాతావరణ అధికారి ఒకరు తెలిపారు. హరియానాలోని నార్నాల్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 6.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయింది. రోహ్‌తక్‌లో 7.6 డిగ్రీల వద్ద స్థిరపడింది. ఫతేహాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 7 డిగ్రీలు, పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో 6.5 డిగ్రీలు, భటిండాలో 6.2 డిగ్రీలు, ఫరీద్‌కోట్‌లో 7.5 డిగ్రీలు, గురుదాస్‌పూర్‌లో 6.7 డిగ్రీలు, అమృత్‌సర్‌లో 7.2 డిగ్రీలు, లూథియానాలో 7.1 డిగ్రీలు, పటియాలాలో 8.7 డిగ్రీలు, రెండు రాష్ట్రాల ఉమ్మడి రాజధాని చండీగఢ్‌లో 7.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది.

మంత్రివర్గ ఏర్పాటులో జాప్యంపై గెహ్లాత్ మండిపాటు

జైపూర్: ఇటీవల జరిగిన రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ... మంత్రివర్గం ఏర్పాటులో జాప్యం చేయడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ తప్పుబట్టారు. దీనివల్ల పాలన స్తంభించిందని, ప్రజల్లో నిరాశ నెలకొందని చెప్పారు. ప్రజలు తమ సమస్యలపై ఏ మంత్రులను సంప్రదించాలో నని ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం సజావుగా సాగేందుకు వీలైనంత త్వరగా మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. 'డిసెంబర్ 3న రాజస్థాన్ ప్రజలు బీజేపీకి స్పష్టమైన ఆదేశం ఇచ్చినందుకు ఇప్పుడు ప్రజల్లో నిరాశ మొదలైంది. 22 రోజుల తర్వాత కూడా మంత్రివర్గం ఏర్పాటు కాలేదు, దాని కారణంగా పాలన స్తంభించిపోయింది. ప్రతి ప్రభుత్వ విభాగం కూడా గందరగోళ స్థితిలో ఉంది' అని గెహ్లాత్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఒకట్రెండు రోజుల్లో మంత్రివర్గ ఏర్పాటు ఉంటుందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. దాదాపు 15 మంది ఎమ్మెల్యేలు మంత్రి మండలిలో చేరే అవకాశం ఉంది. చిరంజీవి పథకం కింద ప్రైవేట్ ఆసుపత్రుల ద్వారా రోగులకు చికిత్స అందడం లేదని మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిందని గెహ్లాత్ తెలిపారు. చిరంజీవి ఆరోగ్య బీమా పథకాన్ని గెహ్లాత్ ప్రారంభించారు. దీని కింద రాజస్థాన్ ప్రజలకు రూ.25 లక్షల వరకు ఉచితంగా చికిత్స అందించబడుతోంది. 'ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రస్తుత ప్రభుత్వం మా ప్రభుత్వ పథకాలకు సంబంధించి పరిస్థితిని కూడా స్పష్టం చేయాలి. కొత్త వ్యవస్థ అమలులోకి వచ్చే వరకు మునుపటి వ్యవస్థ కొనసాగాలి' అని గెహ్లాత్ పేర్కొన్నారు. కాగా రాష్ట్రంలో గత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఏ పథకాన్ని నిలిపివేయలేదని ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ వెల్లడించారు. గత ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా సంక్షేమ పథకాలను బీజేపీ ప్రభుత్వం నిలిపివేస్తుందన్న కాంగ్రెస్ ఆరోపణలపై శర్మ స్పందిస్తూ... "కాంగ్రెస్ నాయకులు 'మా పనులు, మా పథకాలు' అంటున్నారు... ఏ పథకాలను నిలిపివేయబోమని నేను మీకు చెప్పాలనుకుంటున్నాను" అన్నారు.

యూపీలో పొగమంచు కారణంగా ఢీకొన్న వాహనాలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. దేశ రాజధాని దిల్లీకి సుమారు 86 కిలోమీటర్ల దూరంలో ఉన్న హాపూర్‌లోని హఫీజ్‌పూర్ కొత్వాలి ప్రాంతంలో అనేక వాహనాలు ఒకదానికొకటి బలంగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో అనేక మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హపూర్-బులంద్‌షహర్ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. పొగ మంచు కారణంగా సుమారు 10 వాహనాలు ఒకదానికొకటి బలంగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో అనేక కార్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మరోవైపు ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో దెబ్బతిన్న కార్లను క్రేన్ సాయంతో పోలీసులు అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించే చర్యలు చేపట్టారు.

పౌరుల మరణాలపై సైన్యం దర్యాప్తు

బ్రిగేడియర్ స్థాయి అధికారి తొలగింపు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు చెందిన పూంచ్‌లో ముగ్గురు పౌరుల మరణాలపై సైన్యం అంతర్గతంగా దర్యాప్తు చేపట్టింది. ఈ నేపథ్యంలో బ్రిగేడియర్ స్థాయి అధికారిని విధుల నుంచి తొలగించారు. ఆ అధికారిని పూంచ్ నుంచి తరలించినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. కొంతమంది సైనికాధికారులపై కూడా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నాయి. మరికొందరి అధికారుల పోస్టులు మారనున్నట్లు వెల్లడించాయి. కాగా, గత వారం పూంచ్‌లో సైనిక కాన్వాయ్‌పై ఉగ్రవాదులు ఆకస్మిక దాడి చేశారు. ఈ సంఘటనలో నలుగురు సైనికులు ప్రాణాలు కోల్పోగా మరికొందరు గాయపడ్డారు. అయితే ఉగ్రవాదుల దాడి గురించి ప్రశ్నించేందుకు బఫ్లియాజ్ ప్రాంతానికి చెందిన సుమారు 15 మంది జవాన్లు అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు పౌరులైన మహ్మద్ సఫీర్, షబీర్ అహ్మద్, షోకత్ హుస్సేన్ సైన్యం కస్టడీలో మరణించారు. గాయపడిన సుమారు 12 మంది గ్రామస్తులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మరోవైపు అదుపులోకి తీసుకున్న గ్రామస్తులను సైనికులు కొట్టి చిత్రహింసలకు గురిచేసిన వీడియో దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీంతో జవాన్ల వేధింపుల వల్ల ముగ్గురు పౌరులు మరణించగా, అనేక మంది గాయపడినట్లు గ్రామస్తులు, రాజకీయ పార్టీల నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ముగ్గురు పౌరుల మరణంపై సమగ్ర దర్యాప్తునకు సైన్యం ఆదేశించింది. కాగా, ఉగ్రవాదుల దాడులు పెరుగడం, అనేక మంది సైనికులు చనిపోవడం, పౌరుల మరణాలపై ఆరోపణలు వంటి పరిణామాల నేపథ్యంలో సైనిక దళాల ప్రధానాధికారి మనోజ్ పాండే సోమవారం జమ్మూకశ్మీర్‌లో పర్యటించనున్నారు. నగ్రోటాలోని వైట్ నైట్ కార్ప్స్ ప్రధాన కార్యాలయంలో భద్రతపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అలాగే ఉగ్రవాదుల దాడులు జరిగిన ప్రాంతాలను ఆయన సందర్శిస్తారని సైనిక వర్గాలు వెల్లడించాయి.

తమిళనాడులో ఈడీ అధికారులపై కేసు నమోదు

చెన్నై: తమిళనాడు పోలీసులు.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులపై కేసు నమోదు చేశారు. ఈడీ అధికారులు తమ విధులకు ఆటంకం కలిగించారంటూ డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖ (డీవీఏసీ) అధికారులు చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... తమిళనాడులోని మదురైలో ఈడీ అధికారిగా పని చేస్తున్న అంకిత్ తివారీని లంచం కేసులో ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో భాగంగా డీవీఏసీ అధికారులు తనిఖీల నిమిత్తం స్థానిక ఈడీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ సోదాలు చేస్తున్న సమయంలో ఈడీ అధికారులు తమను అడ్డుకున్నారని డీవీఏసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈడీ అధికారులపై మదురై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలాఉండగా, నిందితుడైన ఈడీ అధికారి అంకిత్ తివారీ ఓ ప్రభుత్వ అధికారి ఆస్తులకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా తొలుత రూ.3 కోట్లు డిమాండ్ చేశాడు. ఆ తర్వాత రూ.51 లక్షలైనా ఇవ్వాలన్నాడు. చివరికి ఒప్పందంలో భాగంగా రూ.20 లక్షల లంచం తీసుకుంటుండగా... అంకిత్‌ను డీవీఏసీ అధికారులు పట్టుకున్నారు.

అప్రూవర్‌గా అమిత్ చక్రవర్తి

న్యూదిల్లీ: న్యూస్ క్లిక్ మానవ వనరుల విభాగం అధిపతి అమిత్ చక్రవర్తి తాను అప్రూవర్‌గా మారేందుకు అనుమతిని కోరుతూ దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చైనా తరపున తాను ప్రచారం చేసేందుకు తమ పోర్టల్ డబ్బు తీసుకుంటుందని యుఎపిఎ చట్టం కింద అమిత్ చక్రవర్తి పైన కేసు పెట్టారు. అయితే స్పెషల్ జడ్జి హర్‌దీప్‌కౌర్ ముందు చక్రవర్తి అప్లికేషన్ పెట్టుకున్నట్టుగా కోర్టు వర్గాలు వెల్లడించాయి. ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్న దిల్లీ పోలీసులకు సహకరిస్తూ దర్యాప్తులో పాల్గొంటానని చక్రవర్తి తన పిటిషన్‌లో తెలియజేశారు. చక్రవర్తి ప్రకటనను మెజిస్టీరియల్ కోర్టులో రికార్డు చేసేందుకు జడ్జి వాయిదా వేశారు. చక్రవర్తి ప్రకటన ద్వార తన దరఖాస్తులోని అంశాలకు మద్దతు తెలియజేస్తానని చెప్పినట్టుగా పోలీసు వర్గాలు వెల్లడించాయి. అక్టోబరు 3 వ తేదీన ఈ కోర్టు చానెల్ వ్యవస్థాపకుడు చక్రవర్తిని, ప్రధాన సంపాదకుడు ప్రబీర్‌పురకాయస్థను దిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం అరెస్టు చేసింది. ప్రస్తుతం వీరు పోలీసు కస్టడీలో ఉన్నారు. ఎఫ్ఐఆర్ ప్రకారం భారతదేశ సార్వభౌమత్వాన్ని విధ్వంసం చేసేందుకు చైనా నుంచి న్యూస్ క్లిక్ భారీ మొత్తంలో డబ్బు తీసుకున్నది. పీపుల్ ఎలయెన్స్ ఫర్ డెమొక్రసి అండ్ సెక్యులరిజం గ్రూపు ద్వార పురకాయస్థ కుట్ర పన్నినట్టు ఎఫ్ఐఆర్ తెలిపింది. 2019 లోకసభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రక్రియను ధ్వంసం చేసేందుకు కుట్ర పన్నినట్టు ఎఫ్ఐఆర్ పేర్కొన్నది. ఎఫ్ఐఆర్‌లో తెలిపిన పేర్ల ప్రకారం అక్టోబరు 3 న దిల్లీలోను మరో ఏడు రాష్ట్రాలలోను పోలీసులు 88 ప్రాంతాల్లో సోదాలు చేశారు. న్యూస్ క్లిక్ కార్యాలయం నుంచి 300 ఎలక్ట్రానిక్ సాధనాలను స్వాధీనం చేసుకున్నారు. న్యూస్ క్లిక్ జర్నలిస్టుల నివాస గృహాలను కూడ సోదా చేశారు. అలాగే 9 మంది మహిళలతో సహా 46 మంది జర్నలిస్టులను స్పెషల్ పోలీసుల విభాగం ప్రశ్నించింది.

సేవాభావం పెంపొందించడంలో క్రైస్తవ సమాజం పాత్ర ఎనలేనిది: మోదీ

న్యూదిల్లీ: సమాజానికి దిశానిర్దేశం చేస్తూ సేవా భావాన్ని పెంపొందించడంలో క్రైస్తవ సమాజం పోషిస్తున్న పాత్ర ఎనలేనిదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశం గర్వంగా దీనిని గుర్తిస్తోందని అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఇక్కడి తన నివాసంలో క్రైస్తవ మత పెద్దలతో జరిగిన ఇంటరాక్షన్‌లో క్రైస్తవులతో తనకున్న పాత, సన్నిహిత, ఆప్యాయతలను మోదీ గుర్తుచేసుకున్నారు. పేదలకు, అణగారిన వారికి సేవ చేయడంలో తాము ఎప్పుడూ ముందుంటామని చెప్పారు. దేశవ్యాప్తంగా ఆరోగ్యం, విద్యా రంగాలలో క్రిస్టియన్ సంఘాలు నిర్వహిస్తున్న సంస్థలు దేశాభివృద్ధిలో అపూర్వ సహకారాన్ని అందిస్తున్నాయని ఆయన అన్నారు. యేసుక్రీస్తు జీవిత సందేశం కరుణ, సేవపై కేంద్రీకృతమైందని, అందరికీ న్యాయం జరిగే సమ్మిళిత సమాజం కోసం ఆయన కృషి చేశారని మోదీ కొనియాడారు. ఈ విలువలు తమ ప్రభుత్వ అభివృద్ధి ప్రయాణంలో 'మార్గదర్శక కాంతి'గా పనిచేస్తున్నాయని ప్రధాని అన్నారు. హిందీ తత్వశాస్త్రానికి మూలాధారంగా భావించే ఉపనిషత్తులు కూడా బైబిల్ వంటి సంపూర్ణ సత్యాన్ని గ్రహించడంపై దృష్టి సారించాయని పేర్కొన్నారు.

ఎట్టకేలకు మధ్యప్రదేశ్‌లో మంత్రివర్గ విస్తరణ

28 మంది మంత్రులుగా ప్రమాణం

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ మెజారిటీతో గెలిచి మూడు వారాలకు పైగా గడిచిపోయింది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి విషయంలో వారం రోజుల్లోనే బీజేపీ ఏకాభిప్రాయానికి వచ్చినప్పటికీ, మంత్రుల పేర్లను ఖరారు చేసేందుకు 22 రోజులు పట్టింది. ఎట్టకేలకు సోమవారం తొలిసారిగా మధ్యప్రదేశ్ మంత్రివర్గాన్ని విస్తరించారు. ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మంత్రివర్గంలో కైలాష్ విజయవర్గీయ, ప్రహ్లాద్ పటేల్ సహా 28 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ మంగుభా సి పటేల్ వీరిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. వీరిలో 18 మంది కేబినెట్ మంత్రులు, 10 మంది సహాయ మంత్రులు ఉన్నారు. ఎంపీ దిగ్గజాలైన ప్రద్యుమ్న సింగ్ తోమర్, విశ్వాస్ సారంగ్‌లను కూడా కొత్త మంత్రివర్గంలోకి తీసుకున్నారు. సీఎం మోహన్ యాదవ్ మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కిన ఇతరుల్లో విజయ్ షా, కరణ్ సింగ్ వర్మ, రాకేష్ సింగ్, ఉదయ్ ప్రతాప్ సింగ్, సంపతియా ఉయికి, తులసీరామ్ సిలావత్, అయిదల్ సింగ్ కాన్సానా, గోవింద్ సింగ్ రాజ్‌పుట్, విశ్వాస్ సారంగ్, గౌతమ్ టెట్వాల్, నారాయణ్ సింగ్ పన్వార్, నరేంద్ర శివాజీ పటేల్, నిర్మలా భురియా, నారాయణ్ సింగ్ కుష్వాహ, నగర్ సింగ్ చౌహాన్, ప్రద్యుమ్న సింగ్ తోమర్ తదితరులు ఉన్నారు. కాగా, 230 మంది సభ్యులున్న రాష్ట్ర అసెంబ్లీలో మంత్రివర్గ సభ్యుల సంఖ్య సీఎంతో కలిసి 35 మంది వరకూ ఉండవచ్చు. డిసెంబర్ 13న సీఎంగా మోహన్ యాదవ్, ఉప ముఖ్యమంత్రులుగా రాజేంద్ర శుక్లా, జగదీష్ దేవ్డా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. బీజేపీ ఎన్నికల్లో మహిళా సాధికారతపై విస్తృత ప్రచారం చేసినప్పటికీ మంత్రులుగా ఐదుగురు మహిళలకే చోటు కల్పించడం గమనార్హం. కొత్త కేబినెట్‌లోని 11 మంది సభ్యులు ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ)వర్గానికి చెందినవారు. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓబీసీలకు మంత్రివర్గంలో ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది. మోహన్ యాదవ్‌ను ముఖ్యమంత్రిగా చేయడంలో కూడా బీజేపీ ఉద్దేశం అదేనన్న ప్రచారం ఉంది. పార్టీ అధినేత జెపీ నడ్డాతో సహ బీజేపీ అధిష్ఠానంతో విస్తృత చర్చల తర్వాత మధ్యప్రదేశ్ కొత్త మంత్రులను ఎంపిక చేశారు. గత నెలలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించింది. కీలక హిందీ రాష్ట్రంలోని 230 సీట్లలో 163 సీట్లను గెలుచుకుంది. ఐదేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో 114 సీట్లను గెలుచుకున్న కాంగ్రెస్‌తో గట్టి పోటీ ఉంటుందని చాలా ఎగ్జిట్ పోల్స్ అంచనాలను వేసినప్పటికీ కాంగ్రెస్ పార్టీ కేవలం 66 సీట్లకు మాత్రమే పరిమితమైంది.

విజృంభిస్తోన్న కరోనా

కొత్తగా 628 కేసులు - నాలుగు వేలు దాటిన క్రియాశీల కేసులు

న్యూదిల్లీ: దేశంలో కరోనా వ్యాప్తి రోజురోజుకు పెరిగిపోతోంది. కరోనా వైరస్ పాజిటివ్ కేసుల సంఖ్య నాలుగు వేలకు పెరిగింది. కరోనా ఉప వేరియంట్ జేఎన్.1 కారణంగా కరోనా కేసులు పెరుగుతున్నాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం, దేశంలో ఒకే రోజు 628 కొత్త కోవిడ్-19 కేసులు నమోదయ్యాయి. దీంతో క్రియాశీల కేసుల సంఖ్య 4,054కి పెరిగింది. గత 24 గంటల్లో కేరళలో మరొకరు మరణించారు. గడిచిన 24 గంటల్లో 128 కొత్త కేసులు కేరళలో నమోదయ్యాయని కేంద్ర వైద్య శాఖ పేర్కొంది. రాష్ట్రంలో క్రియాశీల కేసుల సంఖ్య 3,128కి చేరుకుంది.అలాగే, గడిచిన 24 గంటల్లో 296 మంది కరోనా నుంచి కోలుకున్నారు. మొత్తం మరణాలు 5,33,334 (5.33 లక్షలు) నమోదయ్యాయి. ఉదయం 8 గంటలకు నవీకరించబడిన సమాచారం ప్రకారం, దేశంలో ప్రస్తుతం కోవిడ్ కేసుల సంఖ్య 4,50,09,248 (4.50 కోట్లు) గా ఉంది. ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ ప్రకారం, వ్యాధి నుంచి కోలుకున్న వారి సంఖ్య 4,44,71,860 (4.44 కోట్లు) కి పెరిగింది. జాతీయ రికవరీ రేటు 98.81 శాతంగా ఉంది. ఇక మరణాల రేటు 1.19 శాతంగా ఉంది. 220.67 కోట్ల కోవిడ్ టీకా మోతాదులు పంపిణీ చేశారు.

63కు పెరిగిన జేఎన్.1 ఉపరకం కేసులు

దేశంలో కోవిడ్ కొత్త ఉపరకం జేఎన్.1 కేసులు 63కు చేరాయని సోమవారం కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. వాటిలో అత్యధికంగా గోవాలో 34 కేసులు వెలుగుచూడగా... మహారాష్ట్రలో తొమ్మిది మంది దీనిబారినపడ్డారు. కర్నాటకలో 8, కేరళలో 6, తమిళనాడులో 4, తెలంగాణలో 2 జేఎన్.1 రకం కేసులు బయటపడినట్లు కేంద్రం తన ప్రకటనలో పేర్కొంది. జేఎన్.1 ఉపరకం వైరస్ సోకినవారిలో స్వల్ప లక్షణాలు మాత్రమే కనిపిస్తున్నాయని, బాధితులు త్వరగా కోలుకునే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. కేరళలో కొన్ని రోజుల క్రితం ఈ జేఎన్.1 ఉపరకానికి సంబంధించి తొలి కేసు బయటపడింది. 79 ఏళ్ల మహిళకు ఇది సోకింది. అయితే ఆమె ఇంట్లోనే ఉండి పూర్తిగా కోలుకున్నారని... ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ఈ ఉపరకం కేసులు ఇప్పటికే అనేక దేశాల్లో వెలుగు చూసినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) వెల్లడించింది. అమెరికా, చైనా, సింగపూర్‌తో పాటు భారత్‌లోనూ ఈ కేసులు నమోదయినట్లు తెలిపింది. దీన్ని 'వేరియంట్ ఆఫ్ ఇంట్రెస్ట్'గా పేర్కొన్న డబ్ల్యూహెచ్‌వో... ఇది ప్రజల ఆరోగ్యంపై పెద్దగా ప్రభావం చూపదని పేర్కొంది. ప్రస్తుత శీతాకాల సీజన్ పరిగణనలోకి తీసుకొని కోవిడ్ నియంత్రణ చర్యలపై దృష్టి సారించాలని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాశారు. జేఎన్.1 గురించి ప్రజలు ఆందోళన చెందకుండా... అప్రమత్తంగా ఉంటే దీని వ్యాప్తిని తేలిగ్గా అడ్డుకోవచ్చని వైద్య నిపుణులు తెలిపారు.

మహారాష్ట్ర మంత్రికి కోవిడ్ పాజిటివ్

ముంబై: మహారాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ధనుంజయ్ ముండేకు కోవిడ్ సోకినట్లు ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తెలిపారు. అయితే వైరస్ ఇన్‌ఫెక్షన్ గురించి ఎవరూ భయపడనవసరం లేదని పవార్ అన్నారు. 'నా మంత్రివర్గ సహచరుడు ధనుంజయ్ ముండేకు కోవిడ్ పాజిటివ్ వచ్చింది. నాగ్‌పూర్‌లో జరిగిన అసెంబ్లీ శీతాకాల సమావేశాల చివరి రోజు ముండేకు కోవిడ్ నిర్ధారణ అయింది. రాష్ట్రంలో కోవిడ్ వ్యాప్తి చెందకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం' అని పవార్ తెలిపారు. 'కోవిడ్ నిర్ధారణ అయిన వెంటనే మంత్రి హోం ఐసోలేషన్‌కు వెళ్లి చికిత్స తీసుకున్నారు. ఇప్పుడు ఆయనకు ఎలాంటి లక్షణాలు లేవు. ఇంట్లో నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లలో పాల్గొంటున్నారు. అయితే మంత్రి ఆఫీసు సిబ్బందిలో కొందరు అనారోగ్యం పాలయినప్పటికీ వారికి కొవిడ్ లక్షణాలు లేవు' అని మంత్రి కార్యాలయ అధికారి ఒకరు వివరించారు.

మిమిక్రీ కళా రూపం... నా ప్రాథమిక హక్కు

ఉపరాష్ట్రపతి ధన్కర్‌ను మళ్లీ అనుకరించిన టీఎంసీ ఎంపీ

కోల్‌కతా: పార్లమెంటు ఆవరణలో మిమిక్రీ చేసి రాజకీయ దుమారం రేపిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ కళ్యాణ్ బెనర్జీ మరోసారి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌ను అనుకరించారు. పశ్చిమ బెంగాల్‌లోని తన లోక్‌సభ నియోజకవర్గం సెరంపూర్‌లో జరిగిన రాజకీయ సమావేశంలో మళ్లీ మిమిక్రీ చేయడంతో పాటు తన చర్యను సమర్థించుకున్నారు. మిమిక్రీ కళా రూపమన్న ఆయన తాను వెయ్యిసార్లు చేస్తానని తెలిపారు. ఇది తన ప్రాథమిక హక్కు అని అన్నారు. లోక్‌సభలో మిమిక్రీ చేసిన మొదటి వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీని అనుకరించారు. 'ఆయన అలా చేశారు, మేం నవ్వుకున్నాం. మరోలా తీసుకోలేదు' అని వ్యాఖ్యానించారు. కాగా, మిమిక్రీ ఒక కళ అని టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ పునరుద్ఘాటించారు. ఎవరికైనా కళ అర్థం కాకపోతే ఏం చేయగలను? అని ప్రశ్నించారు. 'ఎవరికైనా హాస్యం అర్థం కాకపోతే, ఎవరికైనా సంస్కార వంతమైన మనస్సు లేకపోతే, ఎవరైనా తనను తాను లక్ష్యంగా చేసుకుంటే, నేను నిస్సహాయుడిని' అని ఉపరాష్ట్రపతి పేరు చెప్ప కుండా అన్నారు. తనను జైలులో పెట్టినప్పటికీ వెనక్కి తగ్గబోనని, ఇది తన ప్రాథమిక హక్కు అని స్పష్టం చేశారు. మరోవైపు తన అనుకరణ మీ గురించే (జగదీప్ ధన్కర్) అని ఎందుకు అనుకుంటున్నారో తనకు అర్థం కాలేదని కళ్యాణ్ బెనర్జీ అన్నారు. 'ఆయన పగలు రాత్రి ఏడుస్తున్నారు. చిన్నపిల్లాడిలా ఎందుకు అంతగా ఏడుస్తున్నారు?' అని ప్రశ్నించారు. అలాగే ధన్కర్‌ను ఎవరో ఆటపట్టిస్తున్నారని ఏడుస్తూ తల్లికి ఫిర్యాదు చేస్తున్న పిల్లవాడిగా అనుకరించారు. ఈ వీడియో దృశ్యం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ మండిపడ్డారు.

ప్రసాదం తిని ఒకరి మృతి

70 మంది పరిస్థితి విషమం

బెంగళూరు: కర్నాటక రాజధాని బెంగళూరు నగరంలో విషాదం నెలకొంది. హోస్కోటేలోని ఓ ఆలయం వద్ద పంచి పెట్టిన ప్రసాదం తిని ఓ మహిళ మృతి చెందగా, మరో 70 మందికి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరందరికి వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... హోస్కోటేలోని ఓ ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అయితే రోజు మాదిరిగానే అక్కడ శనివారం కూడా ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. ఇక భక్తులు ప్రసాదం సేవించి, తమ తమ నివాసాలకు చేరుకున్నారు. ఆదివారం 70 మంది దాకా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ ఓ మహిళ సోమవారం ఉదయం మృతి చెందింది. అనేక మంది ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. అయితే ప్రసాదం సేవించని ఇతర భక్తులకు ఎలాంటి వాంతులు, విరేచనాలు కాలేదని అధికారుల విచారణలో తేలింది.

చలిపులి పంజా

- గణనీయంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- దట్టమైన పొగమంచుతో వాహనదారుల ఇక్కట్లు
- విమాన రాకపోకలకూ తీవ్ర అంతరాయం
- గన్నవరంలో మూడు సర్వీసులు అత్యవసర ల్యాండింగ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో చలి పులి పంజా విసురుతోంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లితోపాటు, మన్యం ప్రాంతంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల కంటే అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీనివల్ల గిరిజన ప్రాంత ప్రజలు, రోజు వారీ కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చలి ప్రభావంతో ఉదయం వేళ జాతీయ రహదారులపై రాకపోకలకు కూడా అంతరాయం కలుగుతోంది. అర్ధరాత్రి నుంచి ఉదయం 8 గంటల వరకు దట్టమైన పొగ మంచు కమ్ముతుండడంతో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై చాలా ప్రాంతాల్లో వాహనదారులు ఇబ్బందులెదుర్కొంటున్నారు. ప్రమాదాలు జరుగుతాయన్న భయంతో ముందుకు కదల్లేక వాహనాలను నిలిపివేస్తున్నారు. అత్యవసర పనుల మీద వెళ్లేవారు సైతం అతి జాగ్రత్తగా వెళ్ళాల్సి వస్తోంది. గతంలో పొగమంచు కారణంగా చాలా అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో బెంబేలెత్తుతున్నారు. అవకాశం ఉన్నవారు రాత్రి పూట ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారు. ఉదయం 8 గంటల తర్వాత మాత్రమే అటు హైదరాబాద్, ఇటు విజయవాడల నుంచి బయలుదేరుతున్నారు. సోమవారం జగ్గయ్యపేట, నందిగామ, కంచికచర్ల తదితర ప్రాంతంలో ఏర్పడిన దట్టమైన పొగమంచువల్ల వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. చెన్నయ్-కలకత్తా రహదారిపై కూడా అనేక ప్రాంతాల్లో దారి పొడవునా పొగమంచు కారణంగా వాహనాలు నిలిచిపోయాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించకపోవడం, వేగవంతంగా వాహనాలను నడపలేని పరిస్థితి ఉండటం వెరసి ముందుకు సాగలేక హోటల్స్, పెట్రోలు బంకుల వద్ద వాహనాలను ఆపుకుంటున్నారు.

విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం

పొగమంచు కారణంగా వాతావరణం అనుకూలించకపోవటంతో గన్నవరం విమానాశ్రయంలో మూడు విమానాలను అత్యవసరంగా దింపాల్సి వచ్చింది. చత్తీస్‌గఢ్ నుంచి హైదరాబాద్, గోవా నుంచి హైదరాబాద్, తిరువనంతపురం నుంచి హైదరాబాద్‌కు రావల్సిన విమానాలను అత్యవసరంగా గన్నవరం విమానాశ్రయంలో దింపేశారు. ఒక్కో విమానంలో సుమారు 150 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరంతా ఏం జరుగుతుందో అర్ధంగాక తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇక హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయాన్ని కూడా పొగమంచు కమ్మేసింది. దీంతో అనేక విమానాలకు రాకపోకలకు అంతరాయం కలిగింది. పొగమంచు వల్ల వాతావరణం అనుకూలించిక పోవడంతో కొన్ని విమానాలను దారి మళ్లించారు. ఉదయం 07:35 గంటలకు మస్కట్ నుంచి శంషాబాద్ రావాల్సిన ఒమన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని, ఉదయం 8:05 గంటలకు రియాద్ నుంచి రావలసిన విమానాన్ని, ఉదయం 9:10 గంటలకు జెడ్డా నుండి రావాల్సిన విమానాలను బెంగళూరుకు దారి మళ్లించారు. కొన్నింటిని నాగపూర్‌కు దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయం నుండి కొచ్చి వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానం రద్దు కావడంతో అయ్యప్ప భక్తులు ఆందోళనకు దిగారు. ఉదయం 9:40కి కొచ్చి వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానం పొగ మంచు కారణంగా 11 గంటలకు వెళ్లనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. అయితే 11 గంటలు దాటినా విమానాన్ని కొచ్చికి వెళ్లేందుకు సుముఖత చూపకపోవడంతో విమానాశ్రయంలో అయ్యప్ప భక్తులు ఆందోళనకు దిగారు. మరోవైపు ప్రస్తుతం పూత, పిందె దశలో వున్న మామిడికి పొగమంచు తీవ్ర నష్టం చేకూరుస్తుందని రైతులు వాపోతున్నారు. మంచు అధికంగా ఉంటే పూత రాలిపోతుందని, తద్వారా ఆ ప్రభావం దిగుబడిపై పడుతుందని మామిడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాజ్‌పేయికి చంద్రబాబు నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజకీయాలకు అతీతంగా అందరూ కీర్తించే గొప్ప వ్యక్తిత్వం కలిగిన నేత వాజ్‌పేయి అని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు. మాజీ ప్రధాని అతల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన చంద్రబాబు, వాజ్ పేయితో తన అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ట్వీట్ చేశారు. వాజ్‌పేయితో గడిపిన ప్రతి క్షణం నేను నేర్చుకోవడానికి లభించిన గొప్ప అవకాశం. రాజనీతి, దేశం పట్ల ప్రేమలో వాజ్‌పేయి ఉన్నతమైన స్థానం పొందారంటూ ట్వీట్‌లో పేర్కొన్నారు.

సస్పెన్షన్ కాదు సమస్య మూలంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి : అచ్చెన్నాయుడు లేఖ

మడకశిర తహసీల్దార్ ముర్నావలి సస్పెన్షన్‌పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి టీడీపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు సోమవారం లేఖ రాశారు. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం మడకశిర తహశీల్దార్ ముర్నావలిని అవినీతి అంశంపై మాట్లాడినందుకు సస్పెండ్ చేశారు. ఏ కారణంతో అయినా లంచం తీసుకోవడం సమర్థనీయం కాదు. అయితే ముర్నావలి లేవనెత్తిన సమస్యపైనా ప్రభుత్వం దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో ముర్నావలి వివరించారు. వ్యవస్థలు ఎంత నిర్వీర్యం అయ్యాయో తద్వారా తెలుస్తోంది. వీడియో ద్వారా ముర్నావల్లి వెల్లడించిన సమస్య పరిష్కారంపై ప్రభుత్వం దృష్టిపెట్టకుండా సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వ చర్య చూస్తుంటే వ్యాధికి కాకుండా వ్యాధి లక్షణాలకు చికిత్స చేస్తున్నట్లు ఉంది. ముర్నావలి సస్పెన్షన్ ఆర్డర్‌ను ఉపసంహరించుకుని సమస్యకు మూలంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. ముర్నావలి ప్రకటన ద్వారా పరిస్థితుల గురించి తెలుసుకొని, అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని అచ్చెన్నాయుడు కోరారు.

కేవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

ఎంపీ కృష్ణదేవరాయలకు యూనియన్ నేతల వినతి

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్రీయ విద్యాలయాలలో పని చేసి రిటైరయిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమస్యలను సంబంధిత మంత్రిత్వ శాఖకు తెలియజేసి పరిష్కరించాలని ఆల్ ఇండియా కేంద్రీయ విద్యాలయ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సోమవారం పార్లమెంటు సభ్యులు లావు కృష్ణదేవరాయలను కలిసి వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఎంఏసీపీ సమస్య, సీజీహెచ్ఎస్ సౌకర్యాలు వెంటనే కల్పించి ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో ప్రారంభానికి నోచుకోని పాఠశాలలను వెంటనే అందుబాటులోకి తేవాలని, అమరావతి ప్రాంతీయ కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌ను ఏర్పాటు చేయాలని విన్నవించారు. కేంద్రీయ విద్యాలయంలో నిలిపివేసిన గ్రాండ్ చిల్డ్రన్ అడ్మిషన్ కోటాను పునరుద్ధరించాలని కోరారు. ఈ సమస్యలపై స్పందించిన ఎంపీ కృష్ణదేవరాయలు సంబంధిత మంత్రిత్వ శాఖకు తెలిపి పరిష్కరించటానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో కేవీడీ ప్రసాద్, విశ్రాంత ప్రిన్సిపల్ ఎన్.చలపతి, బి.నాగేశ్వరరావు, కేవీపీఎస్ఎస్ హైదరాబాద్ రీజియన్ అధ్యక్షులు బి.ఎస్.వి.సీతారామ, ఎండీ నసీమ్ ఉన్నారు.

ప్రజా సేవలో తరిస్తున్నా

దేవుడి దీవెనలతో అందరి రుణం తీర్చుకుంటా

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం ఆనందాన్నిచ్చింది: వైఎస్ జగన్

విశాలాంధ్ర-పులివెందుల: దేవుడి ఆశీస్సులతో ప్రజల రుణం తీర్చుకుంటామని, ఏటా సొంత గడ్డపై క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పష్టం చేశారు. వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలో సోమవారం క్రిస్మస్ పర్వదినం సంద ర్భంగా సీఎస్ఐ ప్రార్థన మందిరంలో జరిగిన ప్రార్థనల్లో సీఎం జగన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సొంత జిల్లా పర్యటనలో ఉన్న సీఎం... మూడవ రోజు సోమవారం ఉద యం ఇడుపులపాయ ఎస్టేట్ నుంచి హెలికాప్టర్‌లో బాకరపురం హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుండి రోడ్డు మార్గం ద్వారా ఉదయం 9.30 గంటలకు సీఎస్ఐ చర్చి ప్రాంగణం చేరుకున్నారు. అప్పటికే అక్కడ వేచ్చి ఉన్నవారిని ఆప్యాయంగా చిరునవ్వుతో పలకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ పండుగ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి... ఇక్కడికి విచ్చేసిన బంధువర్గానికి, స్నేహితులు, ఆప్తులు, అభిమానులకు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు, ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులు, బంధుగణం, స్నేహితులతో.. కలిసి పండుగ వేడుకలో పాల్గొనడం మనసుకు ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. మీ అందరి అభిమానం, ఆశీస్సులు, దేవుని చల్లని దీవెనలు తనకు ఎల్లవేళలా అందాలని కోరుకుంటున్నా నన్నారు. ప్రజల రుణం తీర్చుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజాసేవలో తరిస్తున్నానని... ఎప్పటికీ మీ హృదయాల్లో ప్రియమైన నాయకుడిగా సుస్థిర స్థానాన్ని పొందగలనని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసిన ముఖ్యమంత్రి... 2024 చర్చి క్యాలెండర్ ను ఆవిష్కరించారు. క్రిస్మస్ వేడుకలో ముఖ్యమంత్రి తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతమ్మతో పాటు, వైఎస్ ప్రకాష్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, వైఎస్ మనోహర్ రెడ్డి తదితర బంధువర్గాలు, ఆత్మీయులు, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్ బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, ఎమ్మెల్యే డా. డీ సుధా, జిల్లా కలెక్టర్ వీ విజయ్ రామరాజు, జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్, పాడా ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ముగ్గురు మావోయిస్టుల మృతి

చింతూరు (విశాలాంధ్ర): చత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ, సుకుమా జిల్లాల్లో సోమవారం పోలీస్ బలగాలకు మావోయిస్టుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టుల మృతి చెందారు. బస్తర్ రేంజ్ డీఐజీ సుందర్ రాజ్ పట్వా కథనం ప్రకారం... కటే కళ్యాణ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దబ్బకున్న గ్రామ పరిధిలో ఉన్న గుట్టల మీద డీఆర్‌జీ పోలీసులు సీఆర్పీఎఫ్ జవాన్లు గాలింపు జరుపుతుండగా ఎన్‌కౌంటర్ జరిగిందని తెలిపారు. అలాగే దంతెవాడ సుకుమ జిల్లాల సరిహద్దులో ఉన్న తుమక్పాల్ అడవిలో మరోచోట కాల్పులు జరిగాయని చెప్పారు. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టుల మృతి చెందగా... వారి నుంచి భారీ సంఖ్యలో ఆయుధాలు, మందు పాతర సామాగ్రి, విప్లవ సాహిత్యం, 2 నాటు తుపాకులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మృతి చెందినవారిని మాచకోట ఎల్ఓఎస్ కమాండర్ లక్ష్మణ్ (ఘాట్ రోడ్ ఏరియా కమిటీ), మహిళా మావోయిస్టు సోమే, శుక్రామ్ అలియాస్ పండుగా గుర్తించినట్లు తెలిపారు.

కాకానికి కాంగ్రెస్ నివాళి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో పీసీసీ మాజీ అధ్యక్షులు కాకాని వెంకటరత్నం వర్ధంతిని సోమవారం నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజుతో పాటు పార్టీ నేతలు కాకాని చిత్రపటానికి పూలమాలలేసి శ్రద్ధాంజలి ఘటించారు. కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కలిగిన నాయకునిగా, అధ్యక్షులుగా, కేంద్ర మంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

క్రిస్మస్ కేక్ కట్ చేసిన రుద్రరాజు

అనంతరం గిడుగు రుద్రరాజు క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా పెదపారుపూడి మండలానికి చెందిన బీజేపీ నాయకులు పార్టీలో చేరారు. వారికి రుద్రరాజు కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కృష్ణాజిల్లా అధ్యక్షులు సంజీవరెడ్డి, ధనేకుల మురళి అధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం విజయవాడ వన్‌టౌన్‌లో ఉన్న అతిపెద్ద ఫిలాడెల్ఫియా చర్చిలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ ఏసుప్రభు ప్రేమ, శాంతిని కోరుకున్నారని చెప్పారు. సోనియా గాంధీ తరపున, ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తరపున ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో రుద్రరాజుతో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, పార్టీ ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీ, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఫోటో వివరాలు

1. భారత కమ్యూనిస్టు పార్టీ 99 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్, హిమాయత్ నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌కు ఎర్ర జండాలు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరణ.
2. విజయవాడ పాతబస్తిలోని టీపీ రోడ్డులో అరుణార్ణవమైన తమ్మిన పోతరాజు విగ్రహం
3. విజయవాడలో చలసానినగర్‌లో విద్యుద్దీపాల వెలుగులో సిద్ధం కృష్ణారెడ్డి భవన్.

కూటమి నిర్ణయంపై అసంతృప్తి లేదు

- జేడీయూలో అంతా బాగానే ఉంది
- స్పష్టం చేసిన నితీశ్ కుమార్
- త్వరలోనే సీట్ల సర్దుబాటు జరుగుతుందని వెల్లడి

పాట్నా: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమి నుంచి ప్రధానమంత్రి అభ్యర్థిగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేరును కొందరు నేతలు ఇటీవల ప్రతిపాదించిన తర్వాత జేడీ(యూ)లో చీలిక ఏర్పడవచ్చన్న ఊహాగానాలను బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్ తోసిపుచ్చారు. కూటమిలో పోస్టు కోసం తాను ఎలాంటి ఆసక్తి వ్యక్తం చేయలేదని, తనకు ఎలాంటి అసంతృప్తి లేదని స్పష్టం చేశారు. కూటమి ఏ నిర్ణయం తీసుకున్నా తాను కూటమిలోనే తాను ఉంటానని వివరణ ఇచ్చారు. ఇక తమ పార్టీలో విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలను నీతీశ్ కొట్టిపారేశారు. పార్టీలో అంతా బాగానే ఉందని.. నేతలందరం ఐక్యంగానే ఉంటున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసేందుకు తమ పార్టీ శ్రేణులన్నీ కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. సోమవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ 99వ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నీతీశ్.. . ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, మరో ఇద్దరు మంత్రులతో కలిసి మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. గత వారంలో ఇండియా కూటమి సమావేశంలో జరిగిన చర్చలపై అసంతృప్తిగా ఉన్నట్లు వచ్చిన వార్తల్ని నితీశ్ ఖండించారు. తనకు ఎలాంటి కోరిక లేదని మొదట్నుంచి చెబుతున్నా నన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు సాధ్యమైనన్ని ఎక్కువ పార్టీలను ఏక తాటిపైకి తీసుకురావాలనేదే తన ఏకైక కోరిక అని... ఆ దిశగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు త్వరలోనే పూర్తవుతుందని నితీశ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

బీజేపీ నేతల మాటల్ని పట్టించుకోను

జేడీయూలో అంతర్గత విభేదాలు ఉన్నాయం టూ ఒకవర్గం మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తోసిపుచ్చారు. 'మా పార్టీలో అంతా ఐక్యంగా ఉన్నాం. అంతా సజావుగానే ఉంది. మా గురించి భాజపా నేతలు చెప్పే మాటల్ని నేను పట్టించుకోను. వాళ్లు ఏదైనా అనుకోవచ్చు. దానికి విలువ లేదు. మా దృష్టంతా రాష్ట్ర సమగ్రాభివృద్ధిపైనే ఉంది. బిహార్‌ను అభివృద్ధి చేసేందుకు అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. బిహార్ యువతకు 10లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించాం. ఆ లక్ష్యాన్ని త్వరలోనే చేరుకుంటామని స్పష్టంగా చెబుతున్నా. మహాగట్‌బంధన్ ప్రభుత్వం ద్వారా ఇప్పటికే దాదాపు ఐదు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాం.' అని పేర్కొన్నారు. దిల్లీలో జరిగిన సమావేశానికి హాజరైన ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ మాట్లాడుతూ... 'మంచి సమయంలో (సాహి సమ య్ పర్ హెూ జైగా) సీట్ల పంపకాలు జరుగు తాయి' అని పేర్కొన్నారు. ఇండియా కూటమి నాలుగో సమావేశం గత వారంలో న్యూదిల్లీలో జరిగిన విషయం విదితమే. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలిన క్రమంలో ఈ కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొందరు నేతలు మల్లికార్జున్ ఖర్గే పేరును ప్రధానమంత్రి అభ్యర్థిత్వానికి ప్రతిపాదించారు. అయితే, ఈ ప్రతిపాదనను ఖర్గే వెంటనే తిరస్కరించారు. ఎన్నికల్లో సమైక్యంగా పోరాడి గెలవడమే ఇప్పుడు కూటమి ముందున్న ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే జేడీయూ నేతలు కొందరు బహిరంగానే తమ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఖర్గే ఎవరో ఎవరికీ తెలియదని, కూటమి ఏర్పాటుకు, నేతల మధ్య సయోధ్యకు పాటుపడిన నితీశ్‌కుమార్ దేశమంతటికీ తెలుసునని, ఆయననే ప్రధాని అభ్యర్థిగా ఎంపిక చేయాలని కొందరు వ్యాఖ్యానించారు. కాగా నితీశ్ అసంతృప్తితో ఉన్నారనే ప్రచారం జరగడంతో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సైతం ఆయనకు ఫోన్ చేసి మాట్లాడారు. అయితే త్వరలోనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల పంకాలకు సంబంధించిన చర్చలు జరపాలని ఇండియా కూటమి సమావేశం నిర్ణయం తీసుకుంది. దీనికి డిసెంబర్ 31వ తేదీని తాజా గడువుగా నిర్ణయిం చింది. త్వరలోనే దేశ వ్యాప్తంగా ఇండియా కూటమి బహిరంగ సభలు కూడా నిర్వహించనుంది. ముఖ్యంగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌పై ప్రధానంగా దృష్టి పెట్టాలని కూడా సమావేశం నిర్ణయించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.